




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 352 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 25 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :352 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 25 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# ప్లేట్లు కడిగిన చేతులు.. ఇప్పుడు పోలీసులకే గంతలు!

## రసిక బాబు కథలు

### ఎపిసోడ్-3

పెన్ పవర్ EXCLUSIVE ప్రత్యేకం

- ఇడ్లీ బండి నుంచి బ్లాక్ మెయిల్ వరకూ - రసిక బాబు సీక్రెట్ జర్నీ!
- పత్రికా రంగంలో బిల్డప్ - బ్యాక్‌డోర్‌లో బ్లాక్ మెయిల్
- అశ్లీల నృత్యాలకు యువతుల సప్లయర్ రసిక బాబేనా?
- లంచాలకు లొంగని పోలీసు దర్యాప్తే నిజాన్ని బయటపెడుతుంది!
- ఇడ్లీ బండి నుంచి హైటెక్ వ్యభిచార రాకెట్ వరకు..!
- రసిక బాబు దందాల వెనుక దాగిన రహస్యాలు వెలుగులోకి రానున్నాయా?

ఎపిసోడ్ -4 లో
గుడిని ఆ గుడిలో ........ అమ్మా... రసిక బాబు అంతపనిచేసాడా..

**పెన్ పవర్ ఇన్వెస్టిగేషన్ టీం తాడేపల్లిగూడెం నుంచి, ఆగస్టు 23:** మార్కెట్‌లో చిన్న ఇడ్లీ బండిని నడిపి తన తల్లిదండ్రులకు తోడుగా ప్లేట్లు కడిగే పనితో జీవితం మొదలుపెట్టిన రసిక బాబు ఇప్పుడు అంతటా భయం పుట్టించే పేరుగా మారిపోయాడు. తన తల్లి తండ్రి ఇడ్లీలు, బజ్జీలు అమ్ముతూ పొట్ట పోసుకుంటుంటే, అతడు మాత్రం చిల్లర బుడ్డోడు. కానీ అదే బాల్యం రసిక బాబులో ఓ వేరే కోణాన్ని పెంచింది.

వివరాలు 2లో..





# ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై చంద్రబాబు సీరియస్..

## ధరలు పెంచితే కఠిన చర్యలే!

- ఎరువుల సరఫరా, ధరలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ధరలు పెంచే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి, యూరియా పక్కదారి పట్టకుండా చూడాలని సూచన
- క్షేత్రస్థాయిలో విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలని స్పష్టం
- ప్రైవేటుకు కోటా తగ్గించి, మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా పెంచాలని నిర్ణయం

వివరాలు 2లో..



# పోలవరం ముంచింది జగన్... పూర్తి చేస్తోంది చంద్రబాబు



## అంబటికి కౌంటర్ ఇచ్చిన మంత్రి అనగాని

- పోలవరంపై చంద్రబాబుకు సవాల్ విసిరిన అంబటి రాంబాబు
- దీటుగా బదులిచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్
- జగన్ ప్రభుత్వ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి గురైందని ఆరోపణ
- రివర్స్ టెండరింగ్ పేరుతో డయాఫ్రం వాల్‌ను ధ్వంసం చేశారని తీవ్ర విమర్శ
- కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేశామని వెల్లడి
- 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తామని ధీమా

వివరాలు 2లో..




## ఎడిటర్ వ్యూ

# "లోకల్" వార్

తెలంగాణ కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్ గా మారాయి. నిజానికి ఇరవై నెలల కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు ఒక రెఫరెండంగా చూడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తుంది. అయితే అవి ఏ మేరకు ప్రజల్లో సంతృప్తి నిచ్చాయన్నది ఈ ఎన్నికల్లో తేలనుంది. ఎందుకంటే గ్రామ స్థాయిలోనూ, పట్టణ, నగర స్థాయిలో జరిగే ఎన్నికలు కావడంతో పాటు పార్టీ గుర్తు ఉన్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా జరగనుండటంతో ఇది ఖచ్చితంగా కాంగ్రెస్ ఇరవై నెలల పరిపాలనకు రెఫరెండంగానే భావించాలి. ఎవరు అవునన్నా... కాదన్నా రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఈ ఎన్నికలు ప్రజల మూడ్ ను తెలియజేయనున్నాయి.

**రైతుల్లోనూ అసంతృప్తి..**

అందులోనూ ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామున నుంచి క్యూ లైన్ లో నించుని యూరియా బస్తాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా యూరియా కొరత త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తుంది. మరొకవైపు పాలన విషయంలోనూ ప్రజల్లో కొంత అసంతృప్తి ఉందన్నది వాస్తవం. కాంగ్రెస్ ప్రభుత్వం కావడంతో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీవైపు చూడాల్సి వస్తుంది. అందుకే రేవంత్ రెడ్డి స్వేచ్ఛగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలను కూడా అర్హులైన వారందరికీ అందచేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని సొంత పార్టీ నేతలే బయటపెడుతున్నారు. రైతు భరోసా వంటి పథకాలు చేపట్టినా దానిపై యూరియా వచ్చి ఇబ్బందిపెట్టినట్లయింది.

**పట్టణ ప్రాంతంలో...**

ఇది ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అననుకూల మైన కాలమేనని చెప్పాలి. పల్లె ప్రాంతాల్లో ఇలా ఉంటే హైదరాబాద్ వంటి నగరాల్లో హైడ్రా కూల్చి వేతలు రేవంత్ సర్కార్ పై కొంత మంది ప్రజల్లో అసంతృప్తి ఉంది. అదే సమయంలో మూసీ అభివృద్ధి పథకం కూడా హైదరాబాద్ దాని చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల ఎఫెక్ట్ ఎక్కువగా ఉండే అవకాశముంది. ఇక బీసీ రిజర్వేషన్లను చట్టపరంగా అమలు చేయకుండా పార్టీ పరంగా చేసి ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుంది. కానీ బీసీలు ఎంత మేరకు కాంగ్రెస్ కు అండగా నిలబడతారన్నది మాత్రం సందేహమే. ఇక అనేక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల మధ్య వైరుధ్యాలు, గ్రూపులు కూడా ఈ ఎన్నికల ఫలితాలపై ప్రతిబింబించే అవకాశముంది. అందుకే రేవంత్ రెడ్డికి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలు అంత సులువు కాదన్నది వాస్తవం. మరి గెలిచి పరువు నిలబెట్టుకుంటారా? ఓడి తమ పనితీరును ఇది అని చెప్పదలచుకున్నారా? అన్నది త్వరలోనే తెలియనుంది.

# ప్లేట్లు కడిగిన చేతులు... ఇప్పుడు పోలీసులకే గంతలు!

- మొదటి పేజీ తరువాయి

"వంచనలు, మోసాలు, బ్లాక్ మెయిల్" అనే ఆటలో అతడు త్వరగానే దిట్టయ్యాడు.
సూర్య పత్రికలో అవకాశం ఇచ్చిన కూనిరెడ్డి శ్రీనివాస్ అనే డైరెక్టర్-సినీనిర్మాతను కూడా అతడు తన మాటలతో నిండా ముంచాడని సమాచారం..!

**తనను నమ్మిన వారి చేతులను నరికి వేసిన వాడే రసిక బాబు.**

పాఠాలు చదవకపోయినా, "మోసం ఎలా చేయాలి? బ్లాక్ మెయిల్ ఎలా చేయాలి?" అనే సబ్జెక్ట్‌లో పీహెచ్‌డి చేసిన వాడిలా క్రమంగా ఎదిగాడు. నరసింహారావు అనే సీనియర్ రిపోర్టర్ ను వాడేసుకుని, అతనితో వార్తలు రాయిస్తూ, పైకి "నేనే రిపోర్టర్, నేనే క్రైమ్ జర్నలిస్ట్" అని అక్షరం ముక్క రాకపోయినా తెగ బిల్డప్ ఇచ్చేవాడని సమాచారం.
ఇటీవల తూర్పుగోదావరి జిల్లా గంటావారిగూడెంలో నిర్వహించిన అశ్లీల నృత్యాలకు కూడా తాడేపల్లిగూడెం, రాజమండ్రి, పెంటపాడు ప్రాంతాల యువతులను రప్పించింది కూడా రసిక బాబేననే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. పోలీసు అధికారులు అతని లంచాలకు, ప్రలోభాలకు లొంగకుండా నిజమైన విచారణ చేపడితే, ఒక పెద్ద హైటెక్ వ్యభిచార రాకెట్ బయటపడే అవకాశం ఉందని సమాచారం.

# పోలవరం ముంచింది జగన్... పూర్తి చేస్తోంది చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చకు రావాలంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు విసిరిన సవాల్‌పై రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రాజెక్టును పూర్తిగా గాలికొదిలేసిన వైసీపీ నేతలు ఇప్పుడు సవాళ్లు విసరడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టును ముంచింది జగన్ అయితే, దాన్ని పూర్తి చేసే బాధ్యత చంద్రబాబు తీసుకున్నారని ఆయన స్పష్టం చేశారు.
మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరం ప్రాజెక్టును వరదల్లో ముంచి, రివర్స్ టెండరింగ్ అనే పేరుతో డయాఫ్రం వాల్‌ను పూర్తిగా విధ్వంసం చేశారని అనగాని ఆరోపించారు. కేంద్రం కేటాయించిన నిధులను సైతం దుర్వినియోగం చేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కనీసం నిర్వాసితులకు ఒక్క రూపాయి అయినా ఖర్చు చేసిందా అని ఆయన ప్రశ్నించారు. మొత్తం పాలనలో 3.40 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారని, బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించలేదని గుర్తుచేశారు. "పోలవరం నాకు అర్థం కావడం లేదు, ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేను" అని గతంలో అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు.
26 నెలల పాటు జలవనరుల శాఖ మంత్రిగా పనిచేసిన అంబటి, రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టునైనా సందర్శించి పనులు వేగవంతం చేసే ప్రయత్నం చేశారా అని అనగాని నిలదీశారు. వైసీపీ హయాంలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 33 మంది మరణించారని, గుండ్లకమ్మ, పులిచింతల, ఎర్రకాలువ వంటి అనేక ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయాయని, వీటన్నింటికీ జగన్ ప్రభుత్వ అసమర్థతే కారణమని ఆరోపించారు. దమ్ముంటే ఈ ప్రాజెక్టుల విధ్వంసంపై చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.
ఖకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పనులపై ప్రత్యేక దృష్టి సారించారని అనగాని తెలిపారు. ఇప్పటికే మూడుసార్లు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో సందర్శించి, నిర్వాసితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారని చెప్పారు. కేంద్రం నుంచి రూ.12,157 కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం సాధించామని, ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న నిర్వాసితుల ఖాతాల్లో రూ.1000 కోట్లు జమ చేశామని వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరం కోసం రూ.6,705 కోట్లు కేటాయించామన్నారు.
ప్రస్తుతానికి పోలవరం పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఈ 14 నెలల్లోనే 6 శాతం పనులను విజయవంతంగా పూర్తి చేశామని మంత్రి స్పష్టం చేశారు. రూ.990 కోట్లతో చేపట్టిన నూతన డయాఫ్రం వాల్ నిర్మాణం 500 మీటర్లు పూర్తయిందని, ఎడమ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. చెప్పిన సమయానికి, అంటే 2027 డిసెంబర్ నాటికి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అసలు పోలవరం గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని, చర్చకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నామని అనగాని సత్యప్రసాద్ పునరుద్ఘాటించారు.

# ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై చంద్రబాబు సీరియస్..

రాష్ట్రంలో ఎరువుల ధరలను కృత్రిమంగా పెంచి రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకూడదని, ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం మోపాలని అన్నారు. ఆదివారం నాడు రాష్ట్రంలో ఎరువుల లభ్యత, సరఫరా పరిస్థితిపై ఆయన ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు వ్యవసాయ, విజిలెన్స్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలు, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం, యూరియాను వ్యవసాయేతర పనులకు తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఎరువులను పక్కదారి పట్టిస్తే, వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని తేల్చిచెప్పారు.
క్షేత్రస్థాయిలో విజిలెన్స్ తనిఖీలను ముమ్మరం చేసి, ఎప్పటికప్పుడు యూరియా నిల్వలను పర్యవేక్షించాలని చంద్రబాబు సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ప్రైవేటు డీలర్లకు కేటాయింపులు తగ్గించి, ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరాను గణనీయంగా పెంచాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన పునరుద్ఘాటించారు.

# నేనంటే సుధాకర్ రెడ్డికి ప్రత్యేక అభిమానం: సీఎం చంద్రబాబు

- సీపీఐ నేత సురవరం భౌతిక కాయానికి సీఎం చంద్రబాబు నివాళి
- హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో పార్థివ దేహానికి పుష్పాంజలి
- సురవరంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- ప్రజాహితం కోసం ఎన్నో పోరాటాలు కలిసి చేశామన్న చంద్రబాబు
- ఆయన మరణం తెలుగు వారికి తీరని లోటని వ్యాఖ్య
- సురవరం పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారని వెల్లడి

సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డితో తనకు ఎంతో కాలంగా రాజకీయ అనుబంధం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని కొనియాడారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఉంచిన సురవరం పార్థివ దేహానికి చంద్రబాబు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం ఆయనతో తనకున్న జ్ఞాపకాలను అక్కడి నేతలతో పంచుకున్నారు.
ప్రజాస్వామ్య పరిరక్షణకోసం సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి పోరాడారని చంద్రబాబు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు.
"సురవరంతో నాకు సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. నిత్యం ప్రజాహితం కోసం కలిసి పోరాడాం. ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజలకు సేవలందించారు. సుధాకర్ రెడ్డి నన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. నేను చేసే పనుల్ని, కార్యక్రమాల్ని అభినందించి ప్రోత్సహించేవారు. ఆయన సేవల్ని, పోరాటాలను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. సుధాకర్ రెడ్డి చనిపోయినా పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారు. సుధాకర్ రెడ్డి మరణం సీపీఐతో పాటు, తెలుగు వారికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా" అని సీఎం చంద్రబాబు అన్నారు.



# అంతర్జాతీయ అవార్డులు కొల్లగొట్టిన భారతీయ విస్కీ బ్రాండ్లు ఇవే!

**అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన భారతీయ విస్కీలు**

**జర్మనీలో 'మన్షా'కు "ఇంటర్నేషనల్ విస్కీ ఆఫ్ ది ఇయర్ 2025" అవార్డు**

**అమెరికాలో 'అడంబర' విస్కీకి రెండు ప్రతిష్టాత్మక పురస్కారాలు**

**భారత స్పిరిట్స్ నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు**

**మరో భారతీయ లిక్కర్ 'బందర్‌ఫుల్'కు కూడా గోల్డ్ మెడల్**

భారతీయ విస్కీ పరిశ్రమ అంతర్జాతీయ వేదికపై మరోసారి తన కీర్తి పతాకాన్ని ఎగురవేసింది. దేశీయంగా తయారైన రెండు సింగిల్ మాల్ట్ విస్కీలు అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన పోటీలలో అగ్రస్థానంలో నిలిచి, భారత స్పిరిట్స్ నాణ్యతను ప్రపంచానికి చాటాయి. డివాన్స్ మోడరన్ బ్రూవరీస్‌కు చెందిన 'మన్షా', 'అడంబర' అనే విస్కీ బ్రాండ్లు 2025 సంవత్సరానికి గాను కీలక అవార్డులను కైవసం చేసుకున్నాయి.
వివరాల్లోకి వెళితే, జర్మనీలో జరిగిన మైనింగర్స్ ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అవార్డ్ (%×ూఆ%) 2025 పోటీలో 'మన్షా' సింగిల్ మాల్ట్ విస్కీ ఏకంగా "ఇంటర్నేషనల్ విస్కీ ఆఫ్ ది ఇయర్"గా ఎంపికైంది. దీంతో పాటు గ్రాండ్ గోల్డ్ అవార్డును కూడా గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ విస్కీ రుచిని ప్రముఖ విమర్శకుడు జిమ్ మర్రే ప్రశంసలతో ముంచెత్తారు. "ఇది మాల్ట్ ప్రియుల కల" అని అభివర్ణించిన ఆయన, "ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యున్నత స్థాయి స్కాటిష్ మాల్ట్‌కు చాలా దగ్గరగా ఉంది" అని కితాబిచ్చారు. మరోవైపు, 'అడంబర' అనే మరో భారతీయ విస్కీ కూడా అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరిగిన ఇంటర్నేషనల్ విస్కీ కాంపిటీషన్ (%×ఔజ%) 2025లో తన సత్తా చాటింది. ఈ పోటీలో 'అడంబర' ఏకంగా రెండు అవార్డులను గెలుచుకుంది. "బెస్ట్ సింగిల్ మాల్ట్ ఇండియన్ విస్కీ" మరియు "బెస్ట్ ఇండియన్ విస్కీ" పురస్కారాలను ఇది దక్కించుకుంది. జమ్మూలోని హిమాలయ ప్రాంతంలో తయారైన ఈ విస్కీ తన స్మోకీ ఫ్లేవర్‌కు ప్రసిద్ధి చెందింది. ఈ విజయాలు కేవలం ఈ రెండు బ్రాండ్లకే పరిమితం కాలేదు. హిమ్మలేహ్ స్పిరిట్స్‌కు చెందిన 'బందర్‌ఫుల్' అనే మరో భారతీయ లిక్కర్ కూడా యూఎస్‌ఏ స్పిరిట్స్ రేటింగ్స్ 2025లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ పరిణామాలు భారతీయ స్పిరిట్స్ పరిశ్రమ ఎదుగుదలను, నాణ్యతను స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు స్కాట్లాండ్, జపాన్ వంటి దేశాల ఆధిపత్యం ఉన్న విస్కీ మార్కెట్‌లో ఇప్పుడు భారతీయ బ్రాండ్లు గట్టిపోటీ ఇస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్, తయారీలో అంతర్జాతీయ ప్రమాణాలు భారత విస్కీకి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయి.

## ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి డౌన్...

# కస్టమర్లకు తప్పని తిప్పలు!

**దేశవ్యాప్తంగా మొరాయించిన ఎయిర్‌టెల్ సేవలు**

**గంటల తరబడి కాల్స్, మొబైల్ ఇంటర్నెట్ బంద్**

**వారంలో రెండోసారి నెట్‌వర్క్ సమస్యలు**

**సోషల్ మీడియాలో వెల్లువెత్తిన ఫిర్యాదులు, ఆగ్రహావేశాలు**

**ఒకేసారి 7,000 మందికి పైగా వినియోగదారుల ఫిర్యాదు**

**సంస్థ నుంచి ఇప్పటికీ అందని అధికారిక ప్రకటన**

దేశంలోని ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ వినియోగదారులకు మరోసారి కష్టాలు తప్పలేదు. ఆదివారం దేశవ్యాప్తంగా వేలాది మంది కస్టమర్లు నెట్‌వర్క్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి కాల్స్ చేసుకోలేక, మొబైల్ ఇంటర్నెట్ వాడలేక తీవ్ర అసహనానికి గురయ్యారు. వారంలోపే ఎయిర్‌టెల్ సేవలు ఇలా స్తంభించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఆదివారం ఉదయం నుంచే సిగ్నల్ బలహీనంగా ఉండటం, కాల్ డ్రాప్స్, నెట్‌వర్క్ పూర్తిగా నిలిచిపోవడం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, మధ్యాహ్నం నాటికి ఈ సమస్య తారాస్థాయికి చేరింది. ఒకే సమయంలో 7,000 మందికి పైగా యూజర్లు తమకు సేవలు అందడం లేదని ఫిర్యాదు చేశారు. వీరిలో సగానికి పైగా వినియోగదారులు కాలింగ్ సమస్యలు ఎదుర్కోగా, దాదాపు మూడో వంతు మంది ఇంటర్నెట్ యాక్సెస్ చేయలేకపోయారు. మిగిలిన వారు పూర్తి నెట్‌వర్క్ వైఫల్యాన్ని ఎదుర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా సహా అనేక ప్రధాన నగరాల్లో ఈ అంతరాయం కనిపించింది.
సేవలు నిలిచిపోవడంతో విసుగెత్తిన కస్టమర్లు సోషల్ మీడియా వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "బ్రాడ్‌బ్యాండ్ పనిచేస్తున్నా, మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా కుప్పకూలింది" అని కొందరు యూజర్లు ఎక్స్ లో పోస్టులు పెట్టారు. "మేము బిల్లులు ఆలస్యంగా కడితే వెంటనే జరిమానా విధిస్తారు, కానీ కంపెనీలు సేవలు నిలిపివేస్తే మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదా?" అని మరికొందరు ప్రశ్నించారు. "నేను 198కి కాల్ చేశాను. నెట్‌వర్క్‌లో తీవ్రమైన సమస్య ఉందని, ప్రతి కస్టమర్ దీనిని ఎదుర్కొంటున్నారని ఎయిర్‌టెల్ ధృవీకరించింది" అని చందర్ భాటియా అనే యూజర్ తెలిపారు. కొందరైతే, ఎయిర్‌టెల్ తమకు బలవంతంగా 'డిజిటల్ డీటాక్స్' ఇచ్చిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఆగస్టు 19న కూడా ఇదే తరహాలో 3,500 మందికి పైగా వినియోగదారులు సమస్యలు ఎదుర్కొన్నారు.

## శ్రీ నారాయణస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 24 :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకోత్సవం, గోపూజ, మహా నైవేద్యం అర్చకుల వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు ఈ సందర్భముగా అర్చకులు మంకాళ ప్రసాద్ శర్మ పంచామృతాలతో స్వామివారి మూల విరాట్ మరియు శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను అభిషేకం పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరణ చేసి శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు, శ్రీ నారాయణ స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భజంత్రీల మేళతాళాల నడుమ వేదమంత్రాలతో గోశాలలో గోపూజ కార్యక్రమం,ఆలయ ఆవరణం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని మహా నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు మార్పులపై 29న వినతులు స్వీకరణ : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 24 :** ఈ నెల 29వ తేదీన జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుండి మంత్రులు వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామా నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ నెల 29 వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కర్నూలు నగరంలోని సునయన ఆడిటోరియంలో జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుండి వినతులు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి మంత్రులకు వినతులను అందచేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు స్థల పరిశీలన



**అనంతపురం,పెన్ పవర్ ఆగస్టు 24 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సెప్టెంబర్ మొదటివారంలో అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ పి.జగదీష్ స్థల పరిశీలన చేశారు. ముందుగా ఆదివారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు వద్ద (అనంతపురం-కదిరి జాతీయ రహదారి పక్కన), అనంతరం అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారి పక్కన రాప్తాడు మండలంలోని ఎంఐజి లేఅవుట్ వద్ద ఉన్న స్థలాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పరిశీలించారు. తదనంతరం గార్లదిన్నె మండలంలోని కనుంపల్లి గ్రామం (అనంతపురం-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన) వద్దనున్న స్థలాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పరిశీలించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనే వీలుగా అనంతపురం పట్టణానికి దగ్గరలో మరికొన్ని చోట్ల అవసరమైన స్థలాన్ని పరిశీలించాలని ఆర్డీఓని, తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ట్రాఫిక్ వచ్చి వెళ్లేందుకు వీలుగా వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లను పిలిపించి సంబంధిత స్థలాల స్కెచ్‌లను సిద్ధం చేసి పంపాంచాలని సూచించారు. త్వరితగతిన స్థలాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, అనంతపురం, అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలాల తహసిల్దార్లు హరికుమార్, మోహన్ రావు, ఈరమ్మ, ఎస్సై విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## అధునాతన స్మార్ట్ కిచెన్ షెడ్ పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ చెరుకూరు శ్రీధర్



**కడప, పెన్ పవర్ ఆగస్టు 24 :** వైఎస్ఆర్ కడప జిల్లా, చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జెడ్పి హైస్కూల్ ఆవరణలో అధునాతన వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి. సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో.. నూతన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ను రాష్ట్ర మంత్రిచే ప్రారంభించేందుకు సన్నాహక ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కోసం ఏర్పాటు చేసిన ఆటోమేషన్ సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ కు సంబంధించి.. వంట సామాన్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్. సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ప్రారంభోత్సవానికి హాజరయ్యే రాష్ట్ర మంత్రి వెంట పలువురు





ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వారితోపాటు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో.. పాఠశాల ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించిన జిల్లా కలెక్టర్. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్న.. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఈవో షంశుద్దీన్, ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఏ, సంబందిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల,పెన్ పవర్ ఆగస్టు 24 :** ఈ నెల 25న సోమవారం ఉదయం 9.30 గంటలకు నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in"లో ఆన్‌లైన్‌లో ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. ఉదయం 9-30 గంటలకు అధికారులందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారులు తనఖీలు







**కడప పెన్ పవర్ ఆగస్టు 24 :** కడప నగరం ద్వారకార ఫ్యామిలీ రెస్టారెంట్ ను ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు డాక్టర్ హరిత ఆధ్వర్యంలో ఆహారపు తనిఖీలు, కొన్ని ఆహార పదార్థాలను నాణ్యత నిమిత్తమై ల్యాబ్ పంపించడం జరిగినది. అలాగే హొటల్లో ఉన్నటువంటి పరిసరాలను నిలువ ఉంచిన పదార్థాలను పరిశీలించి వాటిలో కొన్నిటిని ల్యాబ్ పంపించడం జరిగినది. ఆహారం, హొటల్ పరిశుభ్రత విషయంలో వారికి నోటీసులు జారీ చేశామన్నారు. ఆహార విషయంలో నాణ్యతలు లోపిస్తే చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామని, అలాగే ఆహార నాణ్యత విషయంలో, పరిశుభ్రత విషయంలోనూ, తగు సూచనలు సలహాలు హొటల్ యాజమాన్యం వారికి, హొటల్ సిబ్బందికి తగు జాగ్రత్తలు, తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు డాక్టర్ హరిత, సిబ్బందితో పాల్గొనడం జరిగింది.


## మట్టితో వినాయక ప్రతిమలు చేద్దాం

- వినాయక చవితి పత్రి మొక్కలను పెంచండి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 24 :** ప్లాస్టరాఫ్ ప్యారిస్ వినాయక ప్రతిమలు వద్దే వద్దు అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. ఆదివారం ఉదయం పెందుర్తి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒల నేతృత్వంలో విద్యార్థులతో ప్రతిమలు తయారు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.





మట్టితో వినాయక ప్రతిమలు చేద్దాం అని పిలుపునిచ్చారు. ఒక్క సారి వాడి వది లేసే ప్లాస్టిక్ వద్దే వద్దు అని ప్రభుత్వం నిషేధించిందని వివరించారు. వినాయక చవితి పత్రి మొక్కలన్నీ ఔషధ గుణాలు ఉన్నవని, వాటిని ప్రతి ఒక్కరూ పెంచాలని కోరారు. వ్యాపారులు తమ లాభాల కోసం ప్లాస్టరాఫ్ ప్యారిస్‌తో తయారు చేసే ప్రతిమలు వద్దే వద్దన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ సత్యవతి, కోఆర్డినేటర్ జె.రాజేశ్వరి, ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ అనకాపల్లి ఫెసిలిటేటర్ ఐ.కృష్ణ కుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## తిరుపతిలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి ఘన స్వాగతం

**తిరుపతి, పెన్ పవర్, ఆగస్టు 24 :** తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులు. తిరుపతిలోని తాజ్ హొటల్‌లో మంత్రికి పుష్పగుచ్చం అందించి.. శాలువాతో సత్కరించిన తిరుపతి డిఇ శ్రీనివాస్, తిరుపతి రూరల్ డిఇ శైలజ, పుత్తూరు డిఇ అమరనాథ్ రెడ్డి, చంద్రగిరి డిఇ శ్రీనివాస్, చిత్తూరు ఎస్ఇ సురేష్, తిరుపతి ఇఇ రాజా నాయక్, ప్రభాకర్, ఎఇ అజిత్ తదితరులు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలో జరుగుతున్న రహదారుల అభివృద్ధి పనుల పురోగతి గురించి ఆర్ అండ్ బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.



## ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట



**ఒంటిమిట్ట, పెన్ పవర్, ఆగస్టు 24 :** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం పవిత్ర ప్రతిష్ట శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్స వర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ విష్వక్సే నారాధన, పుణ్యాహవచనం, బలిహరణ,శాత్తుమొర, నివేదన, కుంభారాధన, ఉక్తహొమాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుకమూర్తులకు, స్నపనమూర్తులకు, బలిమూర్తులకు, విష్వక్సేనులవారికి, ద్వారపాలకులకు, గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హొమగుండాలకు, బలిపీఠానికి, ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# సైనికులు లేదా మంత్రులు లేదా రాజులు

– ఇందులో మనల్ని మనం ఏ వర్గంలో ఉంచుకుంటాం?

– పెన్ పవర్ కృష్ణారెడ్డి




కడప, పెన్ పవర్, ఆగస్టు 24 : వాక్కు. ఒకప్పుడు, ఒక రాజు, అతని సహచరులు అడవికి వేటకు వెళ్లారు. కానీ ఆ అడవిలో దారి తప్పిపోయి, ఒకరి నుండి ఒకరు విడిపోయారు. రాజు ఒకవైపు, సైనికులు మరోవైపు మిగిలి పోయారు. తన సహచరుల కోసం వెతుకుతూ, రాజు ఒక గుడ్డి సాధువు గుడిసెకి చేరుకున్నాడు. రాజు అతనికి నమస్కరించి, తప్పిపోయిన తన సహచరుల గురించి అడిగాడు. అంధుడైన ఆ సాధువు, "మహారాజా, మొదట మీ సైనికులు ఇక్కడ నుండి వెళ్ళారు, తరువాత మీ మంత్రి వెళ్ళాడు, ఇప్పుడు మీరు వచ్చారు, మీరు ఈ మార్గంలోనే కొంత ముందుకు వెళితే, మీరు వారిని కనుగొనవచ్చు." రాజు తన గుర్రాన్ని సాధువు సూచించిన మార్గంలో పరిగెత్తించాడు, వెంటనే అతని సహచరులను కనుగొన్నాడు. సాధువు చెప్పినట్లుగా, కొద్దిసేపట్లోనే వారందరూ ఒకరినొకరు కలుసుకున్నారు. ఆ సాధువు అంధుడై ఉండి కూడా తన దారిలో వెళ్ళిన వారి స్థానం ఏమిటో ఎలా తెలుసుకున్నాడా అని రాజు ఆశ్చర్యపోయాడు. తిరిగి వస్తుండగా, రాజు, అతని సహచరులు సాధువు గుడిసె వద్దకు వచ్చి, "స్వామీ! మీకు కనిపించనప్పటికీ, ఈ దారిలో ఎవరు ప్రయాణిస్తున్నారో ఎలా గుర్తించగలిగారు?" రాజు మాటలు విన్న అంధ సాధువు ఇలా సమాధానమిచ్చాడు, "ఓ మహారాజా, ఒక వ్యక్తి యొక్క స్థానం, హోదా అతనిని చూసి కాదు, అతని మాటలు వినడం ద్వారా నిర్ణయించబడుతుంది! మొదట, మీ సైనికులు దాటి వెళ్ళినప్పుడు, వారు నన్ను, "ఓ, గుడ్డివాడా, ఇక్కడ నుండి ఎవరైనా దాటినట్లు నీకు వినిపించిందా?" అని అడిగారు. అనాగరికమైన భాష మాట్లాడుతున్న వారి సభ్యత శుద్ధింపబడలేదని నేను అర్థం చేసుకున్నాను. వారు చిన్న హోదాలో ఉన్న సైనికులు అయ్యుండాలి అని అనుకున్నాను. మీ మంత్రి వచ్చినప్పుడు, "స్వామీ, ఎవరైనా ఇక్కడ నుండి దాటివెళ్లారా .....?" అని అడిగాడు, దానివల్ల ఇతను ఒక ఉన్నత స్థాయికి చెందిన వ్యక్తి అని నాకు అర్థమైంది, ఎందుకంటే సంస్కారం లేని వ్యక్తి ఒక ఉన్నత పదవిలో ఉండలేడు. అందుకే సైనికుల తర్వాత మీ మంత్రిగారు దాటి వెళ్ళారు అని చెప్పాను.

మీరు వచ్చినప్పుడు, "నమస్తే సూరదాస్‌జీ గారు, ఇక్కడ నుండి ఎవరన్నా ప్రయాణం చేయడం మీరు విన్నారా?" అని అడిగారు. ఆ క్షణంలో, మీరు మహారాజు అయ్యుంటారని నాకు అర్థమైంది. మీ మాటలలో గౌరవమైన పదాలు ఉన్నాయి, గౌరవం అనేది తమకు తాముగా గౌరవించబడిన వారిచే మాత్రమే ఇవ్వబడుతుంది. ఎన్నడూ గౌరవం అందుకోనివాడు దాని గుణాలను తెలుసుకోలేడు! (శిసూరదాస్ అనే పదం అంధుడిని సంబోధించడానికి ఒక గౌరవప్రదమైన మార్గం) రెండవది, ఈ ప్రపంచం ఒక చెట్టులాంటిది – చెట్టుకు చాలా కొమ్మలు ఉంటాయి, కానీ ఎక్కువ ఫలాలు ఉన్న కొమ్మే వంగి ఉంటుంది. ఈ అనుభవ ఆధారంగానే, నేను అంధుడిని అయినప్పటికీ, సైనికులను, మంత్రిని, మిమ్మల్ని మీరుగా గుర్తించగలిగాను."

కబీర్ దాస్ ఇలా వ్రాశారు –

"ఐసీ వాణీ బోలియే, మన్ కా ఆపా ఖోయే
ఔరన్ కో శీతల్ కరే, ఆపహు శీతల్ హోయే"

అంటే –

అహంకారాన్ని ప్రక్కనపెట్టి శ్రావ్యంగా మాట్లాడాలి.... అది మాట్లాడేవారినీ మిమ్మల్ని ప్రశాంతపరుస్తుంది, అలాగే వినేవారికి కూడా ఆనందాన్ని కలిగిస్తుంది.

కఠినత్వాన్ని తీసివేయండి, దానివల్ల మీ మాటలు చలనంలేని గాలిలాగా భారంగా ఉండవు. మీ మాటలు మృదువుగా, సంస్కారవంతంగా, ప్రశాంతంగా, సమతుల్యంగా ఉండేలా చూడండి. సంస్కారవంతంగా, వినయపూర్వకంగా మాట్లాడే వ్యక్తి, స్వచ్ఛమైన, మృదువైన హృదయాన్ని కలిగి ఉంటాడు.


దాజీ
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్



కడప నగరంలోని మాధవి కన్వెన్షన్ హాల్ నందు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్ రెడ్డి గారి కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమనికి హాజరై.. నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



కడప నగరంలోని మాధవి కన్వెన్షన్ హాల్ నందు టిడిపి సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి కుమార్తె వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాషా. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట కృష్ణ, అంజి, సురేష్, బన్నీ తదితరులు ఉన్నారు.



కడప నగరంలోని మాధవి కన్వెన్షన్ హాల్ నందు టిడిపి సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి గారి కుమార్తె వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు.

# నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశవిద్యాలయ... అన్నదాన కార్యక్రమం





**కడప పెన్ పవర్ ఆగస్టు 24 :** కడప ప్రకాష్ నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయమునకు రాజంపేట నగరానికి చెందిన ఐటీ విద్యార్థి విష్ణువర్ధన్, చెల్లి రజిని, వారి తల్లి గంగా జమున అన్నదాన కార్యక్రమమునకు పదివేల రూపాయలు సంస్థ సెక్రటరీ సువర్ణకు అందజేయడం జరిగింది.

విష్ణువర్ధన్, రజిని గంగాజమున, విద్యార్థుల విద్యాభ్యాసం గురించి, తెలుసుకుని వారి క్రమశిక్షణకు ఎంతో సంతోషపడ్డారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయ కుటుంబమునకు సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్టూడెంట్ పర్సనల్ కేర్ టేకర్, హెల్త్ కేర్ టేకర్, విద్యార్థులు పాల్గొని గంగా జమున కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలపడం జరిగింది.

# మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశీలించిన కలెక్టర్, ఎస్పి




**కడప పెన్ పవర్ ఆగస్టు 24 :** వైఎస్ఆర్ జిల్లా, పెండ్లిమర్రి మండలం.. చెర్లోపల్లె పంచాయతీ బైరవగుట్టపై అధునాతన వసతులతో నిర్మించిన మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి. సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో.. నూతన మోడల్ డిగ్రీ కళాశాల భవనాలను రాష్ట్ర మంత్రిచే ప్రారంభించేందుకు సన్నాహక ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్. మోడల్ డిగ్రీ కళాశాలకు సంబంధించి తరగతి గదులు, బాలికల, బాలుర వసతి గృహాలను పరిశీలించి, ఫర్నిచర్, మౌలిక వసతులపై సంబంధిత ఇంజినీరింగ్.అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్. కళాశాల ఆవరణలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే చర్యలు చేపట్టాలని, వసతి గృహ ఆవరణలో గ్రీనరీని పెంచాలని, పారిశుధ్య పనులు చక్కబెట్టాలని కళాశాల యాజమాన్యానికి సూచించిన జిల్లా కలెక్టర్. కళాశాల ప్రారంభోత్సవానికి హాజరయ్యే రాష్ట్ర మంత్రి వెంట పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వారితోపాటు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో.. కళాశాల ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించిన జిల్లా కలెక్టర్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్న.. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, మండల తహసీల్దార్ అనురాధ, కళాశాల ప్రిన్సిపాల్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్





**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 24 :** రాష్ట్ర ఆర్థిక&ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారు ఆదివారం టీడీపీ విజయవాడ పార్లమెంట్ కమిటీ కూర్పుపై నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం (పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీ, సాధికార కమిటీల ప్రతిపాదనల స్వీకరణ)లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కూడా హాజరయ్యారు.

# మెగాడీఎస్సీ అమలు చేయడం హర్షణీయం



**వేంపల్లి. పెన్ పవర్ ఆగస్టు 24 :** 15 నెలలు ఆలస్యంగా అయినా సరే కూటమి ప్రభుత్వం తొలి సంతకమైన 16,347 టీచర్ పోస్టులకు సంబంధించిన మెగా డీఎస్సీని అమలు చేయడం హర్షణీయం. అదే సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో మిగిలిపోయిన హామీల మాటేమిటి? రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతినిరుద్యోగికి నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి కింద ఇస్తామని కూటమి హామీ ఇవ్వడం జరిగింది .ఇప్పటికీ 14 నెలలు దాటింది. కానీ ఇంతవరకు మూడు రూపాయలు ఇవ్వలేదు. ఈ 14 నెలల్లో ప్రతి నిరుద్యోగి దాదాపు 42 వేల రూపాయలు కోల్పోయాడు .కనీసం వచ్చే సెప్టెంబర్ మాసం నుంచి అయినా సరే కూటమి ప్రభుత్వం సూపర్ సెక్స్ హామీల్లో భాగమైనటువంటి నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ,బకాయిలతో సహా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తా ఉంది. మరొక సూపర్ సిక్స్ హామీ ఆడబిడ్డ నిధి .19 ు 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని మేనిఫెస్టో లోను ,సూపర్ సిక్స్ హామీలలోను కూటమి పేర్కొనడం జరిగింది. రాష్ట్రంలో దాదాపు కోటి 80 లక్షల మంది ఈ వయసులో ఉన్న ఆడబిడ్డలు ఉన్నారు. ఇప్పటికి 14 నెల లు అయింది .అతిగతి లేదు .దాని ఊసే లేదు. అంటే ఈ 14 నెలల్లో 21 వేల రూపాయలు 1959 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డ కోల్పోయింది .కనీసం వచ్చే సెప్టెంబర్ మాసం నుండి అయినా సరే బకాయిలతో సహా ఈ ఆడబిడ్డనిధి హామీని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తాఉంది.అదేవిధంగా ఈబీసీ నేస్తం హామీని ,కాపు నేస్తం హామీని కూడా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉంది.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

**చిత్తూరు పెన్ పవర్ ఆగస్టు 24 :** ఈనెల 25వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 25.8.25 తేదీన ఉదయం 9 .30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు కూడా వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## నంద్యాల జిల్లా పౌరులు ప్రజాప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 24 :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. జిల్లా, మండల, గ్రామాల పేర్లు, అలాగే వాటి సరిహద్దులు మార్పు కోసం ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి ఈనెల 29న రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తులను స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు మరియు నంద్యాల జిల్లాకు సంబంధించి.. కర్నూలు సునయన ఆడిటోరియంలో 29న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు రాష్ట్ర నీటి వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ లు ప్రజలు మరియు ప్రజాప్రతినిధుల నుండి అభ్యర్థనలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు చేసిన అభ్యర్థనలలో ఉత్పన్నమయ్యే సమస్యలు, సలహాలు సూచనలను అధ్యయనం చేసి, సమగ్రంగా పరిశీలించి జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పు కోసం సహేతుకంగా వాటిని పరిష్కరించుటకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. నంద్యాల జిల్లా పౌరులు, ప్రజాప్రతినిధులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి





**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 24 :** తిరుపతి జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ కూడా ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్యలో ఇంగ్లీష్ స్కిల్స్ పై ఆన్లైన్ తరగతులు " విల్ టు కెన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ హైదరాబాద్" వారి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించడం బడుతూ ఉంది. దీనిలో భాగంగాఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుచారు నందు 100 మంది ఉపాధ్యాయులకు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీ రామేశ్వర్ గౌడ్ గారు ఒకరోజు ఉచితంగా ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్ పై శిక్షణను ఇవ్వడం జరిగింది. కార్యక్రమానికి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ కేవీఎన్ కుమార్ గారు పాల్గొనడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం లో బోధించడం వల్ల ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ పరిజ్ఞానం అవసరం అన్నారు దీని కొరకు వీరు ఏర్పాటు చేయబడిన ఆన్లైన్ తరగతులు మరియు ఈరోజు శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులకు స్పీకింగ్ స్కిల్స్ పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. సమగ్ర శిక్ష ,తిరుపతి అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ గౌరీ శంకర్రావు గారు మాట్లాడుతూ ఇంగ్లీష్ ప్రాధాన్యత అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ అవ్వడం వల్ల విద్యార్థులకు వేరు బోధనాపరంగా బోధించడంలో చాలా మెలకువలు అవసరం కావున ఇటువంటి సెక్షన్లను ఉపాధ్యాయులందరూ కూడా వినియోగించుకోవాలన్నారు. శిక్షణ ఇస్తున్నటువంటి రామేశ్వర్ గౌడ్ గారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వడం ద్వారా వారి విద్యార్థులందరికీ కూడా ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందించి ప్రతి విద్యార్థి కూడా ఇంగ్లీషులో అనర్గళంగా తప్పులు లేకుండా మాట్లాడడానికి ఉపయోగపడుతుందన్నారు. తమ సంస్థ ద్వారా ఉచితంగా ఇస్తున్నటువంటి ఈ కార్యక్రమానికి జిల్లాలోని అందరు ఉపాధ్యాయులు కూడా వినియోగించుకొని పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాట వేస్తారని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్స్, సెకండరీ గ్రేడ్ మరియు ఇతర డిపార్ట్మెంట్ నుండి కూడా పలువురు శిక్షణ పొందారు. కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు కె.డి.సారథి మరియు చంద్రశేఖర్ నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, సహోపాధ్యాయులు లీల ప్రతాప్ కావలసిన ఏర్పాట్లతో కార్యక్రమాన్ని జరిపించడం జరిగింది.

# కూటమి ప్రభుత్వంపై వైకాపా దుష్ప్రచారం తిప్పి కొట్టండి : తెదేపా శ్రేణులకు గుమ్మడి సంధ్యారాణి పిలుపు




**ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 24 :** ఎన్నికల మేనిఫెస్టో లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎంత కష్టంగా ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీలను అమలు చేస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీలను అమలు చేయడం లేదని కూటమి ప్రభుత్వం పై దుష్ప్రచారం చేయడం సరికాదని, వైకాపా దుష్ప్రచాలను తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తిప్పి కొట్టాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం స్థానిక పిపిజీ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగినది. ఈ సందర్భంగా గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా ఒంగోలు పార్లమెంట్ టిడిపి కమిటీ తోపాటు ఇతర అనుబంధ సంఘాల కార్యవర్గాలను సమన్వయంతో ఏకాభిప్రాయంతో ఎన్నుకోవాలని సంధ్యారాణి సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వార్డు సభ్యుడి నుండి జడ్పిటిసి సభ్యుడి వరకు అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేసే వారికి కార్యవర్గంలో స్థానం కల్పించాలని పదవులు పొందిన నేతలు కూడా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేయాలని అందర్నీ కలుపుకొని పోవాలని ఆమె పేర్కొన్నారు. ఒంగోలు శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ తో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సారధ్యంలో సమైక్యంగా ఏకాభిప్రాయంతో పార్లమెంటు నూతన కార్యవర్గం తో పాటు అనుబంధ సంఘాలను ఎంపిక చేసుకుందామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను జనార్ధన్ కోరారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పార్టీ పరిశీలకులు కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ కుమార్ రెడ్డి, తెదేపా దర్శి, ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జులు పాల్గొన్నారు.

# తారకరామా స్టేడియంలో రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ క్రీడలు 2025

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, శాప్ ఎండి గిరీషా, చైర్మన్ ఎ.రవి నాయుడు














**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 24 :** ఈ నెల 29 న జాతీయ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకోవడంలో భాగంగా తిరుపతి తారకరామా స్టేడియం నందు రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ క్రీడలు 2025 ను గౌరవ క్రీడ శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, శాప్ ఎండి గిరీషా, చైర్మన్ ఎ.రవి నాయుడు ప్రారంభించారు. క్రీడా శాఖ మంత్రి మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంలో ఈ రాష్ట్రంలో ఎన్నో మార్పులను తీసుకురావడం జరిగిందని, గత సంవత్సరాలలో క్రీడాకారులకు , క్రీడా రంగానికి మబ్బు దినాలు ఉండేవని కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో నేడు మంచి రోజులు వచ్చాయని అన్నారు. గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రీడా ప్రపంచం నివ్వెర పోయేలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయ క్రీడారంగంలోనూ ఈరోజు చాలా మంది క్రీడాకారులు రాణించగలుగుతున్నారంటే ఆ రోజుల్లో ముఖ్యమంత్రి చేసిన ముందుచూపు నిర్ణయాలని గర్వంగా చెబుతున్నాని అన్నారు. ఈరోజు ఉమ్మడి రాష్ట్రాలలో ఉన్న క్రీడాకారులందరూ గతంలో ముఖ్యమంత్రి వేసిన బీజమేనని దీనితో క్రీడారంగం నేడు అభివృద్ధిలో ఉన్నదని అన్నారు. గతంలో కంటే ఇంకా అభివృద్ధి చెందేందుకు క్రీడా శాఖ ఎంతో గాను కృషి చేస్తుందని అందుకు తగిన క్రీడా కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయిన తర్వాత క్రీడ శాఖలో అన్ని సదుపాయాలను అందుబాటులోకి తీసుకుని రావడానికి కృషి చేస్తున్నామని అందులో భాగంగా తిరుపతిలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించే దానికి 30 ఎకరాల కేటాయించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో తిరుపతి నగరం కూడా క్రీడ హబ్ గా మారనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి లో క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలని ఉద్దేశంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక అకాడమీ, స్టేడియం ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు నెలల ముందు గౌ. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రారంభోత్సవం చేసి క్రీడాకారులకు అంకితం ఇచ్చామని తెలిపారు. క్రీడాకారుల కోసం ప్రభుత్వం పని చేస్తుందినీ, క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందనీ, రాష్ట్రం నూతన క్రీడా పాలసీని తీసుకుని వచ్చిందని ఈ పాలసీ అమలుతో క్రీడలకు ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తూ మన రాష్ట్రంలో జరగనున్న 16 వేల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో 450 పోస్టులు క్రీడా కోటాలో దక్కడం క్రీడారంగానికి ఒక శుభ పరిణామం అని ఉన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో అనేక మార్పులను తీసుకుని వచ్చారని దీనితో నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి హై స్కూల్ స్థాయి వరకు విద్యతోపాటు క్రీడలు పై విద్యార్థులు ఆసక్తి పెట్టేలా మరియు వారు క్రీడల్లో రాణించి అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని కోరగా ప్రతి ఒక్క గ్రామంలో ఒక ఆట స్థలం ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్ని విధాలుగా క్రీడా రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు. ఈనెల 29న వైజాగ్ లో జరగనున్న నేషనల్ స్పోర్ట్ డే ఈవెంట్ లో ఈ ఛాంపియన్షిప్ లో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్యమంత్రి గారి చేతుల మీదు ప్రైజ్ లు అందుకోనున్నారని , క్రీడాకారులు బాగా ఆడి గెలుపొందాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకొని స్టేట్ లెవెల్ అమరావతి ఛాంపియన్షిప్ కార్యక్రమం తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.గతంలో రాష్ట్రస్థాయి కార్యక్రమాలు మాత్రమే జరిగేవని ప్రస్తుతం మన తిరుపతి జిల్లాలో జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ కార్యక్రమాలకు తిరుపతి వేదిక కావడం మంచి విషయం అని అన్నారు. ఈ స్పోర్ట్స్ కార్యక్రమంలో ఆర్చరీ ,వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ ,అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్బాల్ హాకీ ,కబడ్డీ ,కోకో, షటిల్ వంటి పది రకాల క్రీడలు నిర్వహించబడతాయని తెలిపారు. నూతన స్పోర్ట్స్ పాలసీని గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకుని వచ్చారని, ఒలంపిక్స్, కామన్వెల్త్ గేమ్స్, నేషనల్ స్పోర్ట్స్ అన్నిటికీ కూడా మంచి ప్రోత్సాహ కాలను అందిస్తూ, గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులలో ఉన్న ప్రతిభను కూడా వెలికితీయడంలో భాగంగా నేడు ఈ క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని, ఈ మూడు రోజులు జరుగుతున్న క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులందరూ మంచి క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని అన్నారు. ఈ క్రీడలలో మంచి ప్రతిభను కనబరిస్తే నేషనల్ స్పోర్ట్స్ కి కూడా మంచి అవకాశం లభిస్తుందని ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరైన వసతి, రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. శాప్ ఎండి మాట్లాడుతూ..స్పోర్ట్స్ డే పురస్కరించుకొని 10 రోజులుగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అమరావతి ఛాంపియన్షిప్ కప్ స్పోర్ట్స్ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముగింపు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ కార్యక్రమాన్ని తిరుపతిలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. 1300 మంది క్రీడాకారులు జిల్లాలోని వివిధ జోన్ ల నుంచి వచ్చారని, పది రకాల వివిధ కేటగిరీ ల లో క్రీడాకారులు పోటీ పడతారని తెలిపారు. ఇక్కడ గెలిచిన క్రీడాకారులకు అందరికీ ఎప్పుడు లేని విధంగా ప్రైజ్ మనీ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అందరు కూడా కష్టపడి ఆడాలని ప్రతి సంవత్సరము కూడా ధ్యాన చంద్ జయంతిని పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవాలని తెలిపారు. అమరావతి ఛాంపియన్షిప్ అనేది ప్రతి సంవత్సరం ఉంటుందని దీని ఇంకా పెద్ద ఎత్తున చేయాలనేది శాప్ ఆశయమని తెలిపారు.. గౌరవ ముఖ్యమంత్రి క్రీడారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని అందులో భాగంగా స్పోర్ట్స్ పాలసీని తీసుకురావడం జరిగిందని తెలిపారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 29 ని ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్చంద్ కి గుర్తుగా నేషనల్ స్పోర్ట్స్ డే ను మన దేశంలో నిర్వహించుకోవడం జరుగుతుందని అందులో భాగంగా మన రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా నేడు మన తిరుపతి నుండి స్టేట్ లెవెల్ అమరావతి ఛాంపియన్ షిప్ 2025 కార్యక్రమాన్ని క్రీడా శాఖ మంత్రి గారి ఆధ్వర్యంలో ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇప్పటివరకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని తద్వారా గొప్పగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చాలని దృఢ సంకల్పంతో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని మొదటగా విజయవాడ, విశాఖపట్నంలో నిర్వహించాలని అనుకున్నామని అయితే క్రీడాకారులకు వసతి కల్పించడంలో ఇబ్బంది ఉన్నందున తిరుపతి జిల్లా కలెక్టర్, ఎం డి సహకారంతో తిరుపతిలో స్టేట్ లెవెల్ అమరావతి ఛాంపియన్షిప్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తమకు పూర్తి సహకారం అందిస్తున్న జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. సినీ హీరో నారా రోహిత్ మాట్లాడుతూ.. క్రీడా శాఖ మంత్రి, శాప్ చైర్మన్ లు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో దేశానికి పథకాలు తీసుకుని వచ్చేందుకు కృషి చేయాలని ఈ మూడు రోజులు జరుగుతున్న క్రీడా కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. యాదవ్ కార్పొరేషన్, హస్తకళ కార్పొరేషన్ చైర్మన్లు మాట్లాడుతూ.. క్రీడాకారులకు శారీరిక దారుఢ్యం తో పాటు మానసిక దారుఢ్యం కూడా కలిగి ఉండాలని తెలిపారు. క్రీడలలో శారీరిక బలమే కాకుండా ఏకాగ్రత కూడా చాలా అవసరం అని తెలిపారు. ఇక్కడకు వచ్చిన క్రీడాకారులు అందరు ప్రథమ స్థానంలో గెలిచి అనుకున్న స్థాయిలో విజయం సాధించాలని కోరుకుంటున్నారని తెలిపారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ.. ఈరోజు అమరావతి ఛాంపియన్షిప్ కప్ నేషనల్ స్పోర్ట్స్ డే ఇక్కడ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో తిరుపతికి చెందిన క్రీడాకారులు మొదటి స్థానంలో రావాలని కోరుకుంటున్నాను అని, క్రీడాకారులకు ఏ అవసరమైన మీకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్, స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్, క్రీడాకారిణి రజిని, డి ఎస్ సి ఓ శశిధర్, క్రీడాకారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన ముత్యాల నారాయణరెడ్డి



**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 24 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆదివారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రకాశం జిల్లా వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయనను పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించినట్లు తెలిపారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేసినట్లు ముత్యాల నారాయణరెడ్డి అన్నారు.

## నేరాల కట్టడికి గస్తీ ముమ్మరం చేయండి : డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్




**పీసీపల్లి పెన్ పవర్ ఆగస్టు 24 :** నేరాల కట్టడికి గస్తీ ముమ్మరం చేసి , విధుల పట్ల అలసత్వం వీడి లా అండ్ ఆర్డర్ పై సక్రమంగా అమలు చేయాలని కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు .వార్షిక తనిఖీలో భాగంగా కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ స్థానిక పెద చెర్లోపల్లి పోలీస్ స్టేషన్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలును, గదులు, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ విధానం, మహిళా సహాయక కేంద్రం, రికార్డ్స్, సీడీ ఫైల్స్ మరియు తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి ఎస్సై కోటయ్య కి పలు సూచనలు చేసారు. 194 బిఎన్ఎస్ఎస్ మిస్సింగ్ కేసులు మరియు పాత పెండింగ్ కేసులలో విచారణ త్వరగతిన పూర్తి చేయాలని, కేసుల విచారణకు చేపట్టవలసిన విధానం గురించి దిశానిర్దేశం చేశారు. నేరాలు కట్టడికి గస్తి ముమ్మురం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతర గస్తీ నిర్వహించేటట్లు, నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బందిని తరచూ అప్రమత్తంగా చేయాలన్నారు . డయల్-112 ఫిర్యాదులు రాగానే వెంటనే స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య ను పరిష్కరించేటట్లు చూడాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు మరింత ముందస్తు చర్యలు తీసుకోవాలని, విరివిగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, స్టేషన్ లో వివిధ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు . విధుల పట్ల అంకితభావంగా ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ఇంకా కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ పై విస్తృతంగా స్కూల్/కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి, సైబర్ నేరాలపై ప్రజలు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.అదేవిధంగా స్టేషన్ సిబ్బందితో పెరేడ్ నిర్వహించి వారికి తగు సలహాలు సూచనలు చేశారు. వినాయక చవితి సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలందరూ వినాయక చవితిని సంతోషంగా జరుపుకోవాలని, అదేవిధంగా విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నిమజ్జనానికి వెళ్లేటప్పుడు పోలీసు వారు ఇచ్చే సూచనలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని తెలిపారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎక్కడైనా గొడవలు జరిగినట్లయితే అట్టివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. ఈ తనిఖీలలో కనిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె ఖాజావలి ఉన్నారు.

## టీటీడీపై భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు : టీటీడీ

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 24 :** గత ప్రభుత్వ హయాంలో 2021 నవంబర్ 24వ తేదిన స్వామి పాదాల చెంతన అలిపిరి లో వున్న పవిత్రమైన ఆ భూమిలో టూరిజం శాఖ 20 ఎకరాల స్థలాన్ని ఒబెరాయ్ హెూటల్‌కు కేటాయించింది. ఎప్పుడైతే సదరు భూమిని టూరిజం శాఖ ఒబెరాయ్ హెూటల్‌కు కేటాయించినట్లు తెలిసిందో అప్పటి నుండి హిందూ సంఘాలు, స్వామీజీలు, భక్తులు, పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో 2024 నవంబర్ 18వ తేది జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో రెషల్యూషన్ నెం: 102 ప్రకారం ఆ పవిత్రమైన భూమి ఒబెరాయ్ హెూటల్‌కు చెందకుండా టీటీడీకి కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది మార్చి 21వ తేదిన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన సందర్భంగా ఏడు కొండలకు ఆనుకుని ఉన్న పవిత్ర ప్రదేశంలో ఎలాంటి అపవిత్ర కార్యాకలాపాలకు వీలు లేకుండా చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఉత్తరం వైపు స్వామి పాదాల చెంత ఆనుకుని ఉన్న భూమిని టీటీడీకి ఇవ్వడానికి అంగీకరిస్తూ సదరు భూమికి బదులుగా రోడ్ కు అవతల వైపు భూమి ని కేటాయించాలని టూరిజం శాఖ కోరడమైనది. దీనిపై 2025 మే 7వ తేదిన జరిగిన బోర్డు సమావేశంలో రెషల్యూషన్ నెం: 250 ప్రకారం భూ బదలాయింపునకు అంగీకారం తెలుపుతూ టీటీడీ ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగింది. ఈ క్రమంలో అలిపిరిలోని స్వామి పాదాల చెంత ఉన్న టూరిజం భూమిని టీటీడీకి , అదేవిధంగా రోడ్డుకు దక్షిణం వైపుగా ఉన్న టీటీడీ భూమిని టూరిజం శాఖకు బదలాయించేందుకు 2025 జూలై 22వ తేదిన జరిగిన బోర్డు సమావేశంలో రెషల్యూషన్ నెం: 385 ప్రకారం ఆమోదం తెలపడం జరిగింది. తిరుమల పవిత్రతను కాపాడే ఉద్దేశంతో రోడ్డుకు ఉత్తరం వైపుగా ఉన్న పవిత్రమైన భూమిని భక్తుల సౌకర్యాల కల్పన నిమిత్తం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగించుకోవాలని టీటీడీ నిర్ణయం తీసుకోవడం జరిగింది. అలిపిరి-చెర్లోపల్లి రోడ్డులో దక్షిణం వైపు ఇప్పటికే పలు నిర్మాణాలు జరిగిన విషయం విదితమే. ఈ కారణంగా దక్షిణం వైపు ఉన్న భూమిని టూరిజం శాఖకు కేటాయించి, తిరుమల కొండకు ఆనుకుని ఉత్తరం వైపుగా ఉన్న పవిత్రమైన భూమిని టీటీడీ తీసుకోవడం జరిగింది. తిరుమల పవిత్రత, భద్రత దృష్ట్యా అలిపిరి రోడ్డులోని తిరుమల కొండకు ఆనుకుని ఉన్న ఉత్తరం వైపు ప్రాంతం టీటీడీకి కీలకమైనది. వాస్తవాలు ఇలా ఉండగా భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై ఆరోపణలు చేయడం సబబు కాదు.


## శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు

**జమ్మలమడుగు పెన్ పవర్ ఆగస్టు 24 :** జమ్మలమడుగు శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సెప్టెంబరు 2 నుండి 4వ తేదీ వరకు పవిత్రోత్స వాలు ఘనంగా నిర్వహించనున్నారు. సెప్టెంబరు 1న సాయంత్రం పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం నిర్వహిస్తారు. సెప్టెంబరు 2న చతుష్టార్చాన, అగ్ని ప్రతిష్ట, పవిత్ర ప్రతిష్ట, సాయంత్రం 6 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 3న పవిత్ర సమర్పణ, సెప్టెంబరు 4న పూర్ణాహుతి, పవిత్రవితరణ, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగనున్నాయి. యాత్రీకుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక దోషాలు జరుగుతుంటాయి. వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

### శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుచానూరు పెన్ పవర్ ఆగస్టు 24 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబరు 2న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుండి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టనున్నారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 5 నుండి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగనున్నాయి. సెప్టెంబరు 4న సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. సెప్టెంబరు 5న పవిత్ర ప్రతిష్ఠ, సెప్టెంబరు 6న పవిత్ర సమర్పణ, సెప్టెంబరు 7న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు.




నిర్మల హృదయం Pure Heart

"దివ్యమూలంతో ఐక్యమైన నిర్మల హృదయం, ఉదాత్తత, ఔదార్యం, ప్రేమలను సహజంగా కురిపిస్తుంది!"

------ లాలాజీ

"A pure heart, united with the divine source, naturally exudes generosity, liberality and love!"

----- Lalaji

నేను,నా మాస్టర్ ఒక్కటే.మమ్మల్ని ఎవరూ విడదీయలేరు.నడుం బిగించి దివ్యానుగ్రహం అందుకోవడానికి సిద్ధంగా ఉండండి.

మరిచిపోవడమే స్మరించడం . సహజమార్గం భగవంతుని చేరే అతి సులువైన మార్గం. కేవలం నిశ్శబ్దంలోనే ప్రాణాహుతిని అనుభవించగలం.

సంపూర్ణ మైన ఆలోచనా రాహిత్యం అసాధ్యం.

ఎందుకంటే,అది మృత్యు సమయంలోనే సంభవిస్తుంది.

(పరమార్థ పుష్పాలు)

## 25న శ్రీ వరాహస్వామి జయంతి

**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 24 :** ఆదివరాహక్షేత్రమైన తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో ఆగస్టు 25న వరాహ జయంతి జరుగనుంది. ఇందులో భాగంగా ఉదయం కలశ స్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేస్తారు. ఆ తరువాత పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లు, వివిధ రకాల పండ్లతో తయారుచేసిన పంచామృతంతో వేదోక్తంగా మూలవర్లకు ఏకాంతంగా అభిషేకం నిర్వహిస్తారు. కలియుగ వైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమలలో అగమ శాస్త్రం ప్రకారం ప్రతి సంవత్సరం శ్రీవరాహస్వామి జయంతిని టిటిడి ఘనంగా నిర్వహిస్తోంది. స్థలమహత్యం ప్రకారం తిరుమలలో తొలి పూజ, తొలి నివేదన శ్రీ వరాహ స్వామివారికే చేస్తారు. భక్తులు ముందుగా శ్రీభూవరాహస్వామివారిని, ఆ తరువాత శ్రీవారిని దర్శించుకోవడం ఆచారం. స్థితి కారుడైన శ్రీ మహావిష్ణువు లోక కల్యాణం కోసం శ్రీ వరాహస్వామివారి అవతారమెత్తి హిరణ్యాక్షుని సంహరించి భూదేవిని రక్షించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది.

## జనసేన నాయకులుగా నియామకం




**శంఖవరం, పెన్ పవర్, ఆగస్టు 24:** శంఖవరం మండలంలోని కొంతంగి పంచాయతీ పరిధిలో జనసేన పార్టీ కీలక నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా కొంతంగి గ్రామానికి శరణం జయబాబు, కొత్తూరు గ్రామానికి తోకలు కిరణ్‌ను పార్టీ ముఖ్య నాయకులుగా నియమించారు. ఈ నియామకంతో గ్రామాల్లో పార్టీ శక్తి మరింత బలపడుతుందని, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి వీరు ముందుండి కృషి చేస్తారని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్తగా నియమించబడిన నాయకులకు గ్రామ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని, భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదిగి, తమ గ్రామాలకు మంచి పేరు తెచ్చిపెట్టాలని ప్రజలు ఆకాంక్షించారు. ఈ నియామకాలు జనసేన పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపాయని, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## వడ్లమూరులో కరెంటు స్తంభాలపై నిర్లక్ష్యం...



**కపిలేశ్వరపురం : పెన్ పవర్ ఆగస్ట్ 24.** కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు మెయిన్ రోడ్ ను ఆనుకుని ఉన్న విద్యుత్ స్థంబాల పర్యవేక్షణలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌కు అనేక విద్యుత్ తీగలను పాదులు ఎక్కి స్తంభాలపై చుట్టేయడం వల్ల ప్రమాదకర పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఈ తీగలకు విద్యుత్ ప్రవహిస్తే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన లైన్‌మెన్లు నిర్లక్ష్యం చూపుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే జరిగే ప్రమాదాలకు విద్యుత్ శాఖ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వడ్లమూరు ఎంపీటీసీ పలివెల మధు హెచ్చరించారు.

## చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్

- జనసేన నాయకుల హర్షం



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 24:** కూటమి ప్రభుత్వం చింతూరు ఏరియా ఆసుపత్రిని 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయడం పట్ల చింతూరు జనసేన పార్టీ మండల నాయకులు ఘనంగా స్వాగతించారు. ఈ నిర్ణయంతో ఏజెన్సీ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక కల నెరవేరిందని, భవిష్యత్తులో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని వారు అన్నారు. జనసేన నాయకులు మాట్లాడుతూ, చింతూరులో 100 పడకల హాస్పిటల్ ఏర్పడటం చారిత్రాత్మక నిర్ణయం. ఇప్పటివరకు ప్రజలు పెద్ద పట్టణాలకు వెళ్లి కష్టాలు పడేవారు. ఇకపై అటువంటి ఇబ్బందులు ఉండవు. వైద్య రంగం అభివృద్ధికి ఇది గొప్ప అడుగు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, ఉపాధ్యక్షులు తీగల రవి, సీనియర్ నాయకులు పయ్యాల నాగేశ్వరరావు, వీర మహిళలు తిగల కవిత, రమణమ్మ, ఎం. సతీష్ మండల నాయకులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## సురవరం మృతి తీరని లోటు

**కుక్కునూరు,పెన్ పవర్,ఆగస్టు 24 :** కమ్యూనిస్టు యోధుడు సీపీఐ అగ్రనేత మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె.లక్ష్మయ్య అన్నారు. ఈ సందర్భంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. వామపక్ష భావజాలంతో విద్యార్థి దశ నుంచే సామాజిక రంగంలోకి అడుగుపెట్టిన సురవరం సుధాకర్ భారత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారని,చివరి శ్వాస వరకు ప్రజా పోరాటాల్లో భాగస్వామిగా నిలిచిన ఆయిన సేవలు పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తి దాయకమన్నారు. ప్రకటన చేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా. శ్యామల,అయితా.సురేష్ బాబు,కురాకుల బాబూరావు, మైసాక్షి.వెంకటాచారి,మడిపల్లి.రమణయ్య,వరసా. పాపారావు ఉన్నారు.

## ఆటో డ్రైవర్లు కు భద్రతా సూచనలు

**కుక్కునూరు,పెన్ పవర్, ఆగస్ట్ 24 :** కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి ఆదివారం నాడు స్థానిక ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత అలాగే ట్రాఫిక్ నిబంధనలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా,ఆటో డ్రైవర్లు రహదారి నియమాలను ఖచ్చితంగా పాటించాలని,అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను నివారించాలని ఆయన సూచించారు. అలాగే, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, వాహనాలను సరైన స్థితిలో నిర్వహించాలని,డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని ఆయన సూచించారు.

# తోటగరువు శ్రీ మురళీకృష్ణ ఉత్సవ నూతన కార్యవర్గం




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 23:** తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ పరిధి10,11,12, వార్డుల పరిధిలో గల తోటగరువు గ్రామ పెద్దల సూచన సహకారులతో ఆదివారం తోటగరువు శ్రీ మురళీకృష్ణ ఉత్సవ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

తోటగురువు గ్రామంలో జరిగే అన్ని పండుగలు శ్రీమురళీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలని గ్రామ పెద్దలు నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ తీర్మానించింది. ఇకపై తోటగరువు గ్రామంలో జరిగే అన్ని పండుగలు సదరు గ్రామ పెద్దలు యువత మరియు నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ తీర్మానాలకు ప్రజలు సహకరించాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. గ్రామ పెద్దల సూచనలు సలహాలతో నూతన కమిటీ కలిసి నడుస్తుందని కమిటీ తీర్మానించింది. గ్రామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు గా మన్యాల మహేష్. అధ్యక్షులు మొల్లి. ఉపాధ్యక్షులు ఒమ్మి పోలిరాజు కార్యదర్శి మొల్లి వెంకటరమణ. సహాయ కార్యదర్శి ఒమ్మి శ్రీను. కార్యా నిర్వహణ కార్యదర్శి ఒమ్మి రాంబాబు. కోశాధికారి ఒమ్మి చిట్టీబాబు. సహ కోశాధికారి ఒమ్మి హరికృష్ణ.లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులకు గ్రామ పెద్దలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చెండాఏలియా మాస్టారుకు ఘన నివాళి



**ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు.**

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 24:**-ఆదివాసీ పార్టీ ఓపిజిఆర్ మరియు డిఎల్‌ఓ వ్యవస్థాపకుడు చెండా ఏలియా మాస్టర్ కు భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 80వ దశకంలో విశాఖ ఏజెన్సీలో గిరిజన హక్కుల కోసం పోరాడేందుకు తన సహచరులతో కలిసి గిరిజన హక్కుల పరిరక్షణ సంస్థ(ఓ పి జి ఆర్)ను ఆదివాసీల కోసం ప్రత్యేకంగా దండకారణ్య రాష్ట్రం కావాలని దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్(డిఎల్‌ఓ) లను ఏర్పాటు చేసి, ఆదివాసీల పక్షాన ఆదివాసీల ప్రక్షాళన కోసం ప్రత్యక్షంగా పోరాటం చేసిన ఉద్యమకారుడు చెండా ఏలియా మాస్టర్ అన్నారు. ఆయన అకాల మరణం ఆదివాసీలకు తీవ్రమైన నష్టమని , ఆయన లేని లోటు యావత్తు గిరిజన సమాజం జీర్ణించుకోలేకపోతుందన్నారు. ఆయన చూపించిన స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కులు చట్టాలు రక్షించుకోవడానికి కృషి చేయాలని, అప్పుడే ఆయన ఆశయాలకు, ఆత్మకు నిజమైన నివాళులర్పించినట్లుని ఆయన అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు దేవుడు ఆదరణ ఇవ్వాలని ఆయన ఉద్యమ ఆశయాలు నెరవేరాలని ఆ దిశగా గిరిజనులు కృషి చేయాలని రాజబాబు ఆకాంక్షించారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..






వీరంశెట్టి సతీష్

**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు24:** మట్టి వినాయకుడిని పూజిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. అనే నినాదంతో పంచాయతీ రాజ్ జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు అన్నారు.

ఇరుసుమండ గ్రామంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమలను కోనసీమ ఆహారనిధి ఫౌండర్ వీరంశెట్టి సతీష్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబుచే ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, తెలుగుదేశం నాయకులు డివి సత్యనారాయణ, అక్కిశెట్టి పెద్దపలువురు నాయకులు పాల్గొన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రతి ఇళ్లలో మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణాన్ని కాపాడాలని ఫౌండర్ వీరంశెట్టి సతీష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆహారనిధి ప్రతినిధులు బండారు సురేష్, పోలిశెట్టి పవన్ మహేష్, వేడుల్లపల్లి అయ్యప్ప స్వామి, రంకిరెడ్డి శ్రీనివాస్, రోళ్ళ హనుమంతు రావు పాల్గొన్నారు

## రేపు పీసా చట్టంపై క్షేత్రస్థాయి సమావేశం



**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 24 :** మండలంలో మంగళవారం రెండు గ్రామ పంచాయితీలలో పీసా చట్టంపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు ఎర్రవరెడ్డి పాలెం పంచాయితీలోనూ, మధ్యాహ్నం రెండు గంటలకు దాలిపాడు పంచాయతీలోనూ పీసా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిసా కార్యక్రమా కి ఐటీడీఏ లీగల్ సెల్ అడ్వైజర్ పల్లా త్రినాధరావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, కార్మికులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు హాజరుకావాలని పత్రికా ప్రకటనలో ఎంపీడీవో తెలియజేశారు.

## కానిస్టేబుళ్లుగా ఎంపికైన హెూంగార్డులను అభినందించిన ఎస్పీ డి.నరసింహ కిషోర్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:** జిల్లాలో హెూంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుళ్ళుగా ఎంపికైన నలుగురు హెూంగార్డులను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు. జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డులుగా పని చేస్తూ, ఇటీవల రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుళ్ళుగా ఎంపికైన నలుగురు హెూంగార్డులను ఎస్పీ ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ వారికి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ పైగల అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయితీతో పని చేసి, పోలీసు శాఖకు మరింత మంచి పేరు తేవాలని, విధుల్లో నిబద్ధతతో పని చేసి, ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించాలని సూచించారు.

కానిస్టేబుళ్ళుగా ఎంపికైన హెూంగార్డులు పి.వి.వెంకట సురేష్, కే.సతీష్, కే.శ్రీను, వై.భీమరాజు లను ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించిన వారిలో ఉన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్.బి.ఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏ.వి.సుబ్బరాజు, జోనల్ డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ సభ జనసేన భవిష్యత్తు వ్యూహాలకు నాంది కాబోతున్నదా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం జనసేన, తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ కలిసి అధికారంలో ఉన్నప్పటికీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన ప్రత్యేక రాజకీయ గుర్తింపును నిలుపుకోవాలనే ఆలోచనలో ఉన్నారనే తెలుస్తున్నది. కొంతమంది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం కూడా ఇదే. 2029 ఎన్నికల సమీకరణలను దృష్టిలో పెట్టుకుని, జనసేన తన వ్యూహాలను ఎటువంటి మార్పులు చేస్తుందో అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. అయితే ఆ ప్రశ్నకు సమాధానం మరో వారంలో దొరకవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**15 వేల మంది జన సైనికులు..**

ఆగస్టు 30న విశాఖ నగరంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మహాసభ నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 15 వేల మంది జనసైనికులు, వీరమహిళలు తరలిరానున్నారు. పవన్ పుట్టినరోజు వేడుకలతో పాటు ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీయనుంది.

**దిశానిర్దేశం చేయబోతున్నారా?**

ఈ మహాసభలో ప్రధానంగా పార్టీ భవిష్యత్ దిశపై పవన్ కల్యాణ్ ఎలాంటి సందేశం ఇస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. ఆయన ప్రత్యేకంగా 12 కమిటీలను ఏర్పాటు చేసి, అన్ని ఏర్పాట్లు పర్యవేక్షణలో పెట్టడం ద్వారా ఈ సమావేశానికి ఇచ్చే ప్రాధాన్యత స్పష్టమవుతోంది. కాగా, జన సైనికులు మాత్రం, ఈ సభ ద్వారా పార్టీ కొత్త పంథాలో అడుగులు వేస్తుందా? లేక ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతుందా? అన్న సందేహాలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు. ఇక పవన్ కల్యాణ్‌కు ఉన్న సినీ క్రేజ్ కూడా ఈ సభకు మరింత ప్రాధాన్యం చేకూర్చుతున్నది. గ్యాంగ్ స్టర్ రోల్ లో ఆయన నటించిన ఓజీ చిత్రం విడుదలకు ముందే ఈ సభ జరగడం, ఇది రాజకీయంగా మాత్రమే కాకుండా సినీ వర్గాల్లో కూడా చర్చకు దారితీస్తున్నది. అభిమానులలో ఒక వర్గం ఆయన నుంచి ఊహించి సర్‌ప్రైజ్ ఉంటుందని భావిస్తున్నది. మొత్తం మీద, ఈ విశాఖ మహాసభ పవన్ కల్యాణ్ వ్యక్తిగత పుట్టినరోజు వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో వచ్చే దశాబ్దానికి దిశా నిర్ధేశం చేసే వేదికగా నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

# దుడుమా జలపాతం విషాదం: ప్రాణాలను బలిగొన్న రీల్స్ మోజు



**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్నిసార్లు సరదాగా మొదలైన పనులు తీరని విషాదాన్ని మిగులుస్తాయి. ఇటీవల ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో ఉన్న ప్రసిద్ధ దుడుమా జలపాతం వద్ద జరిగిన విషాదకర సంఘటన కూడా అలాంటిదే. కేవలం కొన్ని వ్యూస్, లైకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఒక యువ యూట్యూబర్ విషాదాంతం చెందాడు.

**ఏం జరిగింది?**

ఒడిశా రాష్ట్రంలోని సుంకి ప్రాంతానికి చెందిన ప్రముఖ యూట్యూబర్ సగర్, తన స్నేహితులతో కలిసి దుడుమా జలపాతాన్ని సందర్శించాడు. సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్ కోసం ఒక ఆసక్తికరమైన వీడియో లేదా రీల్స్ తీయాలనే ఉద్దేశంతో అతను జలపాతం మధ్యలో ఉన్న ఒక బండరాయిపైకి వెళ్ళాడు. చూడటానికి చాలా ప్రమాదకరంగా కనిపించే ఆ ప్రదేశంలో, అతను జాగ్రత్తగా నిలబడి వీడియో చిత్రీకరణ మొదలుపెట్టాడు. అయితే, విధి వక్రించింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న జలపాతం ఒక్కసారిగా ఉధృతమైంది. పైన కురిసిన వర్షాల వల్ల నీటి ప్రవాహం అకస్మాత్తుగా పెరిగింది. ఈ అనూహ్య ప్రవాహంలో సగర్ తన సమతుల్యం కోల్పోయి జారిపడిపోయాడు. ఆ సమయంలో అతడి స్నేహితులు, అక్కడున్న పర్యాటకులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కళ్లముందే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సగర్‌ను రక్షించలేక వారంతా నిస్సహాయంగా ఉండిపోయారు.

**గాలింపు చర్యలు.. దొరకని ఆచూకీ**

ఈ సంఘటనతో అక్కడున్న వారంతా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే పోలీసులకు, రెస్క్యూ టీమ్‌లకు సమాచారం అందించారు. అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని, గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఆ ప్రాంతం చాలా లోతుగా ఉండటం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టంగా మారాయి. అధికారులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, సగర్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**సోషల్ మీడియాలో చర్చ**

ఈ విషాదకర సంఘటన గురించి తెలిసిన తర్వాత, సోషల్ మీడియాలో తీవ్ర చర్చ మొదలైంది. నెటిజన్లు, ఇతర కంటెంట్ క్రియేటర్లు ఈ ఘటనపై తమ స్పందనలు తెలియజేశారు. చాలామంది ప్రాణాల కంటే కంటెంట్ గొప్పది కాదని, లైకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం అవివేకమని అభిప్రాయపడ్డారు."కేవలం కొన్ని లైకుల కోసం ఇలా ప్రాణాలను పోగొట్టుకోవడం చాలా బాధాకరం. యువత ఇలాంటి ప్రమాదకర ప్రదేశాల్లో వీడియోలు చేయడం మానుకోవాలి." "ప్రాణాలు అమూల్యమైనవి. కంటెంట్ క్రియేటర్లు తమ సురక్షితకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటివి మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి." ఇలాంటి కామెంట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ అవుతున్నాయి.

**సురక్షితమే ముఖ్యం: ఇది ఒక హెచ్చరిక**

ఈ సంఘటన కేవలం ఒక విషాదం మాత్రమే కాదు, సోషల్ మీడియాలో ప్రచారం కోసం ప్రాణాలను రిస్కులో పెడుతున్న యువతకు ఇది ఒక గట్టి హెచ్చరిక. వ్యూస్, లైకులు తాత్కాలికమే కానీ, ప్రాణాలు శాశ్వతమైనవి. ఒక వీడియో తీసే ముందు, అది ఎంత రిస్క్‌గా ఉంటుందో ఆలోచించుకోవాలి. ముఖ్యంగా ప్రకృతి ప్రదేశాలైన జలపాతాలు, నదులు, కొండలు వంటి చోట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు, కానీ దాని శక్తిని తక్కువ అంచనా వేయకూడదు.

చివరగా, గుర్తుంచుకోండి.. మీ ప్రాణాల కంటే విలువైన కంటెంట్ ఏదీ లేదు. సురక్షితంగా ఉండండి!

# ఈ ఎయిర్ ఇండియా విమానాలకు ఏమైంది?




**హైదరాబాద్ పెన్ పవర్:** విమాన ప్రయాణాల్లో ఒకప్పుడు దేశంలో అత్యున్నత సంస్థగా పేరు పొందిన ఎయిర్ ఇండియా.. ప్రస్తుతం వరుస సాంకేతిక లోపాలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా గత వారం రోజుల్లో చోటుచేసుకున్న మూడు ఘటనలు ఈ సంస్థ నిర్వహణపై తీవ్ర సందేహాలకు తావిస్తున్నాయి.

**ముంబై-జోధ్‌పూర్ విమానంలో తీవ్ర గందరగోళం**

శుక్రవారం ఉదయం ముంబై నుంచి జోధ్‌పూర్ బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎయిర్‌బస్ %బూ%319 సాంకేతిక లోపం కారణంగా టేకాఫ్ రద్దు చేసుకుంది. ముంబై టెర్మినల్%-%2 నుంచి 9:15 గంటలకు బయలుదేరాల్సిన ఈ విమానంలో 110 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే, టేకాఫ్ సమయంలో కాక్‌పిట్ సిబ్బంది ఒక ఆపరేషనల్ లోపాన్ని గుర్తించారు. భద్రతా కారణాల దృష్ట్యా విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఈ ఘటనతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం ఎదురైంది. విమానం నిలిపివేసిన తర్వాత, ప్రయాణికులను విమానం నుంచి దింపి, మళ్లీ సెక్యూరిటీ చెక్ ద్వారా పంపాల్సి వచ్చింది. ఆ తర్వాత వారికి ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేశారు. కొత్త విమానం మధ్యాహ్నం 12:36 గంటలకు బయలుదేరింది. ఈ అనూహ్య ఘటన కారణంగా ప్రయాణికులు దాదాపు 3 గంటల 30 నిమిషాల ఆలస్యంతో గమ్యస్థానానికి చేరుకున్నారు.

**వారం రోజులలో మూడో ఘటన**

ముంబై-జోధ్‌పూర్ ఘటన ఎయిర్ ఇండియాకు వారం రోజుల్లో ఇది మూడోది కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతకు ముందు ఆగస్టు 17న ఢిల్లీ నుంచి లేహ్‌కు, ముంబై నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లాల్సిన విమానాలు కూడా సాంకేతిక సమస్యల కారణంగా రద్దు అయ్యాయి. ఈ రెండు ఘటనల్లోనూ ప్రయాణికులు 4 నుంచి 6 గంటల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా జ్యూరిచ్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఒక విమానం కూడా సాంకేతిక లోపం కారణంగా రద్దు చేయబడింది. ఇలాంటి వరుస ఘటనలు ఎయిర్ ఇండియా భద్రతా ప్రమాణాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

**టాటా గ్రూప్‌కు పెను సవాల్**

ప్రస్తుతం టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ఉన్న ఎయిర్ ఇండియా తమ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఆధునికీకరణ, సేవల నాణ్యత పెంపుపై దృష్టి పెట్టింది. అయితే తరచుగా తలెత్తుతున్న సాంకేతిక లోపాలు ఈ ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయి. ప్రయాణికుల నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే, ఎయిర్ ఇండియా కఠినమైన నిర్వహణ తనిఖీలు, భద్రతా ప్రమాణాలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని విమానయాన రంగ నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే, ఈ ఘటనలు సంస్థ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ప్రయాణికుల భద్రత, సమయపాలన విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే, ఎయిర్ ఇండియాకు భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.

# భారత క్రికెట్ లో ఓ శకం ముగిసింది... దిగ్గజ క్రికెటర్ రిటైర్మెంట్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ లో వాల్ అంటే రాహుల్ ద్రవిడ్.. 16 ఏళ్లు అతడు జట్టు బ్యాటింగ్ కు ఓ మూలస్తంభంగా నిలబడ్డాడు. అతడు రిటైర్మెంట్ సమయానికి అలాంటి మరొక బ్యాట్స్ మన్ దేశానికి అవసరమయ్యాడు. కానీ, ఎవరు దొరుకుతారు..? అని చూస్తే.. ద్రవిడ్ స్థానం తనదేనంటూ ఓ క్రికెటర్ ముందుకొచ్చాడు. పదేళ్లకు పైగా బ్యాటింగ్ భారాన్ని మోశాడు. నాలుగేళ్లుగా జట్టుకు దూరమైన అతడు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించాడు. అచ్చం ద్రవిడ్ తరహాలోనే చెక్కుచెదరని డిఫెన్స్ తో జట్టుకు పెట్టని కోటలా నిలిచిన అతడు ఇక ఆట చాలించాడు.

**నయ వాల్ తొలగింది...**

టెస్టు బ్యాట్స్ మన్ చతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకొన్నాడు. అన్ని ఫార్మాట్లకు అతడు రిటైర్మెంట్ ప్రకటించాడు. వాస్తవానికి పుజారా టెస్టుల్లో మాత్రమే ఉన్నాడు. వన్డేలకు అతడిని ఎప్పుడూ పరిగణించలేదు. ఒకటీ, రెండు అవకాశాలు ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదు. ఇప్పుడు టెస్టుల నుంచి కూడా తప్పుకొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగుతున్నట్లు ఆదివారం ప్రకటన చేశాడు. టీమ్ ఇండియా జెర్సీ ధరించడం, మైదానంలో జాతీయగీతం ఆలాపన, జట్టు కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం తన జీవితంలో మధురానుభూతలని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

**రాజ్ కోట్ నుంచి...**

గుజరాత్ లోని రాజ్ కోట్ నగరానికి చెందిన పుజారా సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఇప్పుడు అదే సంగతి గుర్తుచేసుకుంటూ.. రాజ్ కోట్ కుర్రాడు దేశానికి ఆడాడు అనే కల నెరవేరిందని, రాష్ట్రం, దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం అని పేర్కొన్నాడు. తన కెరీర్ ఎదుగుదలకు సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఎంతో సాయం చేసిందని చెప్పుకొచ్చాడు. ఇక మీదట మరింత సమయం కుటుంబానికి కేటాయిస్తానని తెలిపాడు.

**వందకు పైగా టెస్టుల్లో...**

పుజారా దేశానికి 103 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. 2010లో ఆస్ట్రేలియాపై తొలి టెస్టు ఆడాడు. 22 సెంచరీలు (ఇందులో మూడు డబుల్ సెంచరీలు), 35 హాఫ్ సెంచరీలు చేశాడు. మొత్తం 7,195 పరుగులు చేశాడు. పూర్తిగా టెస్టు బ్యాట్స్ మన్ గా ముద్ర పడిన పుజారా ఐదు వన్డేలే ఆడాడు. 51 పరుగులు సాధించాడు. 2023లో ఆస్ట్రేలియాపైనే చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు.

**ఫామ్ కోల్పోయి.. జట్టుకు దూరమై..**

2018-19 ఆస్ట్రేలియా టూర్ లో 1200 పైగా బంతులను ఎదుర్కొని మూడు సెంచరీలు సహా అద్భుతంగా రాణించిన పుజారా ఆ తర్వాత 2021-21 టూర్ లోనూ రాణించాడు. ఓ టెస్టులో 200 పైగా బంతులు ఆడి హాఫ్ సెంచరీ చేశాడు. ఈ రెండు సిరీస్ లను భారత్ గెలుచుకోవడం గమనార్హం. అయితే, పుజారా బ్యాటింగ్ మరీ నెమ్మదిగా సాగుతుండడం, ఇటీవలి కాలంలో దూకుడైన ఆట ఉన్న కుర్రాళ్లు దూసుకురావడంతో పుజారాకు జట్టులో చోటు కష్టమైంది. రెండేళ్ల కిందట ఆస్ట్రేలియాతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో ఆడిన పుజారాను మళ్లీ సెలక్టర్లు కరుణించలేదు. దీంతో 37 ఏళ్ల పుజారా క్రికెట్ కు వీడ్కోలు పలికాడు.

**నాలుగో క్రికెటర్...**

ఈ ఏడాది జనవరిలో ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, స్టార్ బ్యాట్స్ మెన్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టులకు గుడ్ బై చెప్పారు. ఇప్పుడు పుజారా వంతు.

# సమస్య వాళ్లతోనే అంటున్న చంద్రబాబు.. ఇంతకీ వాళ్లెవరు..?

**హైదరాబాద్ పెన్ పవర్:** సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేతల్లో చంద్రబాబు మొదటి వాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తన మామ దివంగత నందమూరి తారక రామారావు హయాంలో పార్టీ పనులు చూసుకుంటూ.. ఆ తర్వాత పార్టీలో కీలక రోల్ ప్లే చేసి సీఎంగా పదవి చేపట్టిన ఆయన ఉమ్మడి రాష్ట్రానికి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసి రికార్డు సృష్టించారు. పార్టీ, పాలనను సమర్థవంతంగా నిర్వహించే నేతగా కూడా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆ తరానికి ఈ తరానికి వారధిగా కూడా చంద్రబాబు నిలుస్తారు. అందుకేనేమో వృద్ధులకు ఎలాంటి పథకాలు కావాలి. యంగ్ స్టర్స్ కు ఎలాంటి పథకాలు కావాలో ఆయన తెలిసినంతగా బహుషా మరో నేతకు తెలియదేమో. ఇదే కాదు గీత దాటితే ఎవరిని ఎలా కంట్రోల్ చేయాలో కూడా ఆయనకు వెన్నతో పెట్టిన విద్యే. క్రమ శిక్షణకు మారు పేరుగా నిలుస్తున్న చంద్రబాబును చూసి సీనియర్ నాయకులు కూడా వణికిపోతుంటారంటే సందేహం లేదు.

**గీత దాటుతున్న వారిపై నిఘా..**

ఇటీవల పార్టీలో వివాదాలు మొదలయ్యాయి. తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో బాబు సీరియస్ గా ఉన్నారని తెలుస్తోంది. పార్టీలో గొడవలు తెచ్చే నేతలకు పలు మార్లు హెచ్చరికలు కూడా జారీ చేశారట. రీసెంట్ గా గీత దాటుతున్న ఎమ్మెల్యేలకు సంబంధించిన బాబు కీలకమైన వ్యాఖ్యలు చేశారట. పార్టీలోని సీనియర్ నాయకులకు క్రమ శిక్షణ గురించి తెలిసే ఉంటుందని అందుకే వారు నిబంధనల మేరకు నడుచుకుంటారని, కొత్తగా ఎన్నికైన వారు కొంత బాధ్యతారాహిత్యంతో ఉంటున్నారని ఆయన అన్నారు. ఇలాంటి 35 మంది ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు.

**ఇటీవల 35 మంది ఎమ్మెల్యేలతో సమావేశం..**

35 మంది ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి తన వ్యవహారం గురించి చెప్పుకచ్చారు. 'ఎవరైనా సరే గాడి తప్పుతున్నట్లు అనిపిస్తే ఒకసారి పిలిచి చెప్తాను.. పద్ధతి మార్చుకోకుంటే మరోసారి పిలిచి చెప్తాను.. అయినా మార్చుకోకుంటే.. మూడో సారి కఠినంగా వ్యవహరిస్తా.. అయితే రెండో సారి మూడో సారి పిలవాలా? వద్దా? అనేది వారి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది' అని చెప్పారు. అయితే బాబు వార్నింగ్ ఇస్తారు కానీ.. చర్యలు తీసుకోరు అన్న వారు కూడా లేకపోలేదు. గీత దాటుతున్నారని తెలిసిన తర్వాత వార్నింగ్ లు ఏంటి? వారిని



ఎందుకు ఉపేక్షించాలంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**వార్నింగ్ లు వద్దు.. యాక్షన్ కావాలంటున్న నేతలు..**

పార్టీ పేరు చెడగొడుతున్న వారికి వార్నింగ్ లు ఏంటని, చేతల్లో చూపించాలని సీనియర్ నాయకులు బాబుకు సూచిస్తున్నారు. కొత్తగా ఎన్నికైన వారిలో ఇవన్నీ తాటాకు చప్పుళ్లలా ఉంటాయని, యాక్షన్ లోకిదిగిన తర్వాతే మిగతా వారు భయపడతారని కొందరు అంటున్నారు. కఠినంగా వ్యవహించాలని కోరుతున్నారు.

# భారత్ - చైనా వాణిజ్యంలో పెరుగుదల


**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, చైనాల మధ్య వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో (ఏప్రిల్-జూలై), భారత్ నుంచి చైనాకు ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలపడుతున్నాయని స్పష్టం చేస్తోంది.

**ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల**

అధికారిక గణాంకాల ప్రకారం, ఏప్రిల్ నుంచి జూలై వరకు భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 20 శాతం పెరిగి %వి%5.76 బిలియన్లకు (సుమారు రూ.50,112 కోట్లు) చేరుకున్నాయి. ఈ పెరుగుదల గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే స్థిరంగా ఉంది. మే నెలలో అత్యధికంగా %వి%1.63 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి, ఇది భారత్ వాణిజ్య వృద్ధికి సానుకూల సంకేతం.

**ముఖ్య రంగాల్లో వృద్ధి**

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనాలో భారతీయ ఉత్పత్తుల



డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో అసాధారణమైన వృద్ధి కనిపించింది. పెట్రోలియం ఉత్పత్తులు దాదాపు రెట్టింపు పెరిగి %వి%883 మిలియన్లకు చేరుకున్నాయి. ఎలక్ట్రానిక్స్ మూడు రెట్లు పెరిగి %వి%521 మిలియన్లకు చేరాయి. రసాయనాలు 16.3% వృద్ధితో %వి%335.1 మిలియన్లకు పెరిగాయి. జెమ్స్ అండ్ జ్యువెలరీ 72.7% పెరుగుదలతో అత్యధిక వృద్ధి సాధించాయి. ఈ గణాంకాలు భారత్ ఎగుమతుల సామర్థ్యం బలోపేతం అవుతోందని, అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీ పడుతోందని సూచిస్తున్నాయి.

**దిగుమతులు, దౌత్య సంబంధాలు**

భారత్ చైనా నుంచి దిగుమతులు కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక వస్తువుల కోసం కొనసాగుతున్నాయి. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా జరగడం, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు మరింత బలపడతాయని సూచిస్తున్నాయి.

ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల మధ్య కూడా భారత్-చైనా వాణిజ్యం కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఈ వృద్ధి ధోరణి కొనసాగితే, రాబోయే రోజుల్లో ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు మరింత స్థిరపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# టెస్టుల్లో నా క్రికెటింగ్ ఐడల్ అతనే.. దిగ్గజాలకు షాక్ ఇచ్చి యంగ్ ప్లేయర్‌కు ఓటేసిన ఆర్య




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 సీజన్ లో తన బ్యాటింగ్ తో వెలుగులోకి వచ్చిన యంగ్ క్రికెటర్ ప్రియాంష్ ఆర్య చెన్నై సూపర్ కింగ్స్‌పై 43 బంతుల్లో సెంచరీ చేసి ఒక్కసారిగా టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిన ఈ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ ఓవరాల్ గా ఈ సీజన్ లో 179 స్ట్రైక్ రేట్‌తో 475 పరుగులు చేసి అదరగొట్టాడు. భవిష్యత్ లో టీమిండియాలోకి రావడానికి అన్ని అర్హతలు ఉన్న ఈ 24 ఏళ్ళ యంగ్ బ్యాటర్.. టెస్ట్ క్రికెట్ లో తన ఐడల్ ఎవరో చెప్పుకొచ్చాడు. సాధారణంగా క్రికెటింగ్ ఐడల్ అంటే దిగ్గజ క్రికెటర్ల పేర్లు చెబుతారు. కానీ ఆర్య మాత్రం ప్రస్తుతం టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ పేరు చెప్పుకొచ్చాడు.

ఆర్య మాట్లాడుతూ.. "నేను రెడ్-బాల్ క్రికెట్ ఆడాలనుకున్నా నా అరంగేట్రం ఇంకా జరగలేదు. ఈ సంవత్సరం రెండ్ బాల్ క్రికెట్ లో ఆడడం జరుగుతుందని ఆశిస్తున్నాను. నేను రంజీ ట్రోఫీలో ఆడాలనుకుంటున్నాను. నేను ఇంతకు ముందు చెప్పినట్టు రాబోయే దేశీయ సీజన్ ఆడడానికి ఆసక్తి చూపిస్తున్నాను. నేను అండర్-19, అండర్-23 క్రికెట్‌లలో చాలా రెడ్-బాల్ క్రికెట్ ఆడాను. కాబట్టి ఈ ఫార్మాట్ ఆడడం నాకు కొత్త విషయం కాదు. రంజీ ట్రోఫీ చాలా కఠినమైనది. పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. మ్యాచ్‌లు ఉదయం ప్రారంభమవుతాయి. ఇది సవాలుతో కూడుకున్నది. రెండ్ బాల్ క్రికెట్ లో శుభ్‌మాన్ గిల్ నాకు ఆదర్శం" అని ఆర్య చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 లో అదరగొట్టిన ప్రియాంష్ ఆర్య ఇప్పుడు టెస్ట్ క్రికెట్ లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఒపెల్ కంటే ముందు ప్రియాంష్ ఆర్య ఢిల్లీ ప్రీమియర్ లీగ్ లో 6 బంతుల్లో 6 సిక్సర్లు బాదేసి సంచలనంగా మారాడు. భారత క్రికెట్ లో యువరాజ్ సింగ్ తర్వాత ఆరు బంతులకు ఆరు సిక్సర్ల కొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్ లో మొత్తం 39 బంతుల్లోనే సెంచరీ చేసుకున్న ప్రియాంష్.. 50 బంతుల్లో 120 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత ఐపీఎల్ 2025 సీజన్ లో ఆర్య ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా నిలిచాడు.

# సౌరవ్ గంగూలీకి హెడ్ కోచ్ బాధ్యతలు.. ఏ జట్టుకు అంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి హెడ్ కోచ్ పదవి వరించింది. 2026 సీజన్‌కు ముందు గంగూలీ ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. ఆదివారం (ఆగస్టు 24) మాజీ బీసీసీఐ చీఫ్ గంగూలీ.. ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ జోనాథన్ ట్రాట్ స్థానంలో గంగూలీ హెడ్ కోచ్ బాధ్యతలు స్వీకరిస్తాడు. ట్రాట్ శనివారం (ఆగస్టు 23) ప్రిటోరియా క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా పదవి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. "ప్రిన్స్ క్యాపిటల్స్ శిబిరంలో చేరడానికి సిద్ధంగా ఉన్నాడు. గంగూలీని మా కొత్త ప్రధాన కోచ్‌గా ప్రకటించడానికి మేము చాలా సంతోషంగా ఉన్నాము". అని సెంచూరియన్ ఫ్రాంచైజీ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది. గంగూలీ క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. 2018, 2019 మధ్య గంగూలీ ఐపీఎల్ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌కు జట్టు డైరెక్టర్‌గా ఉన్నారు. బీసీసీఐ అధ్యక్షుడైన తర్వాత ఆ పదవి నుంచి వైదొలిగాడు. 2025 సౌతాఫ్రికా 20 సీజన్‌కు ముందు ట్రాట్ ప్రధాన కోచ్‌గా విఫలమయ్యాడు. 10 మ్యాచ్ ల్లో కేవలం రెండు విజయాలు మాత్రమే సాధించి నాకౌట్‌కు చేరుకోలేకపోయింది. ఆరు జట్ల ఆడబోయే సౌతాఫ్రికా టీ20 లీగ్ లో పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో నిలిచింది. ప్రిటోరియా క్యాపిటల్స్ విల్ జాక్స్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, ఆండ్రీ రస్సెల్ ను రిటైన్ చేసుకుంది. సౌతాఫ్రికా టీ20 మెగా లీగ్ నాలుగో ఎడిషన్ కు రంగం సిద్ధమైంది. ఇప్పటివరకు ఈ లీగ్ మూడు సీజన్ లు జరిగింది. రెండు సార్లు సన్ రైజర్స్ ఈస్టర్న్ క్యాపిటల్స్ టైటిల్ విజేతగా నిలిచింది. 2025 సీజన్ లో ఎంఐ కేప్ టౌన్ తొలిసారి ఛాంపియన్ గా అవతరించింది. ఎప్పటిలాగే మొత్తం ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్,జోబర్గ్ సూపర్ కింగ్స్,పార్ల్ రాయల్స్, ఎంఐ కేప్ టౌన్,డర్బన్ సూపర్ జెయింట్స్,ప్రిటోరియా క్యాపిటల్స్ ఫ్రాంచైజీలు తమ రిటైన్ ప్లేయర్ల జాబితాను ప్రకటించారు.

# సిరీస్ గెలిచినా చిత్తుగా ఓడారు.. సౌతాఫ్రికా వన్డే చరిత్రలో అతి పెద్ద ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో సౌతాఫ్రికా ఘోరంగా ఓడిపోయింది. మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో భాగంగా చివరి వన్డేలో 276 పరుగుల తేడాతో చిత్తు చిత్తుగా ఓడిపోయింది. ఆదివారం (ఆగస్టు 24) మెకే వేదికగా గ్రేట్ బారియర్ రీఫ్ అరీనాలో ముగిసిన ఈ మ్యాచ్ లో ఓడిపోయిన సౌతాఫ్రికా తమ వన్డే కెరీర్ లో అతి పెద్ద ఓటమిని చవిచూసింది. వన్డే క్రికెట్ చరిత్రలో ఇది రెండో అతి పెద్ద ఓటమి. ఈ సిరీస్ లో తొలి రెండు వన్డేల్లో గెలిచిన సౌతాఫ్రికా 2-1 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది. ట్రావిస్ హెడ్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. కేశవ్ మహరాజ్ కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి. 432 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 24.5 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌట్ అయింది. లక్ష్యం భారీగా ఉండడంతో మొదటి నుంచి వేగంగా ఆడాలని చూసిన సౌతాఫ్రికా 50 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి మ్యాచ్ పై ఆశలు వదిలేసుకుంది. ఈ సమయంలో బ్రెవిస్, జార్జి కాసేపు మెరుపు మెరిపించారు. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు. 49 పరుగులు చేసిన బ్రెవిస్ టాప్ స్కోరర్ కాగా.. మిగిలిన వారందరూ విఫలమయ్యారు. కూపర్ కొన్నోల్లీ 5 వికెట్లు తీసి సఫారీలను తన స్పిన్ మాయాజాలంతో చిత్తు చేశాడు. జేవియర్ బార్ట్‌లెట్, అబాట్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి ఏకంగా 431 పరుగులు చేసింది. జట్టులో ఏకంగా ముగ్గురు సెంచరీలు కొట్టడం విశేషం. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (140), మిచెల్ మార్ష్(100) సెంచరీలతో విజృంభిస్తే.. ఆ తర్వాత కెమరూన్ గ్రీన్ (118) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హెడ్ 103 బంతుల్లోనే 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 140 పరుగులు చేశాడు. మరోవైపు మార్ష్ 106 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 100 పరుగులు చేశాడు. పవర్ హిట్టింగ్ తో దుమ్ములేపిన గ్రీన్ కేవలం 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. క్యారీ 37 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్ కు అజేయంగా 164 పరుగులు జోడించడం విశేషం.



**తమన్నా భాటియా యొక్క ర్యాంప్ వాక్ యొక్క థ్రిల్ అనుభూతి చెందండి**

# ఆది ఖాతాలో మరో భారీ ప్రాజెక్టు?



టాలీవుడ్ టాలెంటెడ్ నటుడు ఆది పినిశెట్టి గురించి సౌత్ ఆడియన్స్ కు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. డైరెక్టర్ రవిరాజా పినిశెట్టి కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆది, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ఎన్నో ప్రయోగాలు చేస్తూ వచ్చిన ఆది రీసెంట్ గా మయసభ వెబ్ సిరీస్ లో కనిపించి ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకున్నారు.

**అఖండ2లో విలన్‌గా ఆది పినిశెట్టి**

ఇప్పటికే నటుడిగా తన సత్తా ఏంటో ప్రూవ్ చేసుకున్న ఆది పినిశెట్టి ఇప్పుడు భారీ బడ్జెట్ సినిమాలపై ఫోకస్ చేశారు. అందులో భాగంగానే ఇప్పటికే అఖండ2 తాండవం ను చేస్తున్నారు ఆది. బాలయ్య- బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న అఖండ2 లో ఆది విలన్ గా నటిస్తున్నారు. ఇప్పుడు అఖండ2తో పాటూ ఆది మరో బిగ్ బడ్జెట్ సినిమాలో అవకాశం అందుకున్నట్టు తెలుస్తోంది.

**కార్తీ సినిమాలో ఆది**

అయితే ఈ సారి ఆది నటిస్తోంది తెలుగు సినిమాలో కాదు. కార్తీ హీరోగా తమిజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మార్షల్ అనే సినిమాలో. వాస్తవానికి ఆది ఇప్పుడు నటించనున్న క్యారెక్టర్ కోసం గతంలో నవీన్ పౌలీని అనుకున్నారు. అయితే మార్షల్ లో ఆది చేయబోయే క్యారెక్టర్‌కు నెగిటివ్ షేడ్స్ ఉంటాయని, సినిమాలో ఆది చేయబోయే క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుందని సమాచారం.

**మార్షల్ లో నాని స్పెషల్ రోల్**

ఈ సినిమాలో ఆదితో పాటూ పలువురు మలయాళ ఇండస్ట్రీకి చెందిన నటులు కూడా నటించనుండగా కళ్యాణి ప్రియదర్శన్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదే సినిమాలో టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని కూడా ఓ స్పెషల్ రోల్ లో కనిపిస్తారంటున్నారు కానీ దీనిపై ఎలాంటి కన్ఫర్మేషన్ లేదు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోన్న ఈ సినిమాకు సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, వచ్చే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



**ప్రకృతి పావని నెయిల్స్ బ్రౌన్ లాంగ్ స్లీవ్ లుక్**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com